

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 09-05-2026 | సంపుటి - 27 | సంచిక -347 | రూ : 4 | పేజీలు: 8




## మూసీ ప్రక్షాళనకు 'మహర్దశ'..
# తొలి దశకు ముహూర్తం ఖరారు!

- రూ. 7,055 కోట్లతో సుందరీకరణ పనులు ఆగస్టు నుంచి క్షేత్రస్థాయిలో అడుగులు

హైదరాబాద్ : దశాబ్దాలుగా మురుగుకూపంగా మారిన మూసీ నదికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 'మూసీ పునరుజ్జీవ పథకం'లో భాగంగా తొలి దశ పనులకు సర్వం సిద్ధమైంది. దాదాపు రూ. 7,055 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించి, 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి తరువాయి 2లో

# కొడంగల్‌కు తిరుమల వైభవం

- బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ
- రూ.110 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- 18 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి: ముఖ్యమంత్రి

2లో





## ఫీజు 'రీయింబర్స్‌మెంట్'లో
# భారీ మార్పులు!

- నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకే బోధన రుసుములు
- 202627 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం
- 'తొలుత దరఖాస్తు చేసిన వారికే ప్రాధాన్యం'
- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సర్కారు కీలక నిర్ణయం

హైదరాబాద్, మే 9: రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ (బోధన రుసుముల చెల్లింపు) పథకంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 202627 విద్యా సంవత్సరం నుంచి పాత పద్ధతికి స్వస్తి పలికి, సరికొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రధానంగా నిధుల విడుదల జాప్యాన్ని తరువాయి 2లో

## కారాగారాల నుంచి
# బయటకు రావడం ఇక కష్టమే!

- పెరోల్ నిబంధనలపై ప్రభుత్వం ఉక్కుపాదం
- జైలు నిబంధనల్లో కీలక మార్పులు
- తీవ్రమైన నేరస్తులకు నో ఛాన్స్
- దుర్వినియోగం చేస్తే ఇక అంతే సంగతులు!

అమరావతి/హైదరాబాద్: శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సామాజిక బాధ్యతల పేరుతో బయటకు వచ్చే 'పెరోల్' అస్త్రాన్ని ఇకపై అంత సులభంగా వాడలేరు. జైలు గోడల మధ్య సంస్కరణలు తేవడమే కాకుండా, సమాజ భద్రతను తరువాయి 2లో






## నగర గగనతలంపై డ్రోన్ల నిఘా..
# రేపు నిషేధాజ్ఞలు అమలు!

- ప్రధాని పర్యటన నేపథ్యంలో పోలీసుల కఠిన చర్యలు
- బేగంపేట, మాదాపూర్ పరిసరాల్లో నో ఫ్లై జోన్

2లో



# విశ్రాంత ఐపీఎస్ వినయ్‌రంజన్ రే భార్య దారుణహత్య

- మరో ఇద్దరితో కలిసి నేపాలీ పనిమనిషి ఘాతుకం
- చేతులు కట్టేసి, నోట్లో వస్త్రం కుక్కి డబ్బు, నగలతో పరారీ
- ఉదయం కుమార్తెలు చూసేసరికి బాధితురాలి మృతి

2లో

# తమిళనాట అదే అనిశ్చితి

- మద్దతు ఇచ్చినట్లే ఇచ్చి తప్పుకొన్న ఐయూఎంఎల్
- వామపక్షాలు తోడొచ్చినా దాటని మ్యాజిక్ ఫిగర్
- మద్దతుపై నేడు ప్రకటిస్తామన్న వీసీకే
- విజయ్ ప్రమాణ స్వీకారానికి మరింత ఆలస్యం!
- మూడోసారి గవర్నర్‌ను కలిసిన టీవీకే అధినేత

2లో





## ఆ హైవేలో...
# ఆగకుండా సాగిపోవచ్చు

2లో

- త్వరలో బారియర్లు లేని టోల్ విధానం
- హైదరాబాద్‌బెంగళూరు హైవేలో రాష్ట్ర పరిధిలో మూడుచోట్ల ఏర్పాటు

# కొడంగల్‌కు తిరుమల వైభవం



కొడంగల్, మే 8: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి (బాలాజీ) ఆలయాన్ని అద్భుత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గమైన కొడంగల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సుమారు రూ.110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్కలతో కలిసి సీఎం భూమిపూజ చేశారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఆలయ పునర్నిర్మాణం ద్వారా కొడంగల్ ఖ్యాతి దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని ఆకాంక్షించారు.

**మోడల్ నియోజకవర్గమే లక్ష్యం**

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "నేను ఈ స్థాయికి చేరడానికి కొడంగల్ ప్రజలే కారణం. వారి రుణం తీర్చుకునేందుకే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నాం. ఈ ఆలయాన్ని తిరుమల తరహాలో ఆగమశాస్త్రం ప్రకారం నిర్మిస్తున్నాం. 18 నెలల్లోనే ఈ పనులు పూర్తి కావాలి" అని అధికారులను ఆదేశించారు. ఆలయంతో పాటు కొడంగల్ను విద్యా హబ్గా మారుస్తామని, ఇప్పటికే మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు మంజూరయ్యాయని గుర్తుచేశారు.

**అభివృద్ధిలో రాజకీయాలు వద్దు**

అభివృద్ధి పనుల విషయంలో కొందరు కావాలనే అడ్డుతగులుతున్నారని సీఎం అసహనం వ్యక్తం చేశారు. "ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయం చేయాలి. అభివృద్ధి విషయంలో అందరూ ఏకతాటిపైకి రావాలి. వచ్చే పదేళ్ల వరకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరిస్తేనే కొడంగల్ను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దగలం" అని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేశారు.

## ఫీజు 'రీయింబర్స్‌మెంట్'లో భారీ మార్పులు!

హైదరాబాద్, మే 9: రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ (బోధన రుసుముల చెల్లింపు) పథకంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 202627 విద్యా సంవత్సరం నుంచి పాత పద్ధతికి స్వస్తి పలికి, సరికొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రధానంగా నిధుల విడుదల జాప్యాన్ని నివారించడం, పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

**నేరుగా విద్యార్థులకే..**

ఇప్పటి వరకు బోధన రుసుముల మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాల్లో జమ చేసేది. అయితే, కొత్త నిబంధనల ప్రకారం ఇకపై ఈ నిధులు నేరుగా విద్యార్థుల 'ఆధార్' అనుసంధిత బ్యాంకు ఖాతాల్లోకే (DBT Mode) చేరనున్నాయి. ప్రభుత్వం నుంచి నగదు అందిన తర్వాత విద్యార్థులే స్వయంగా కళాశాలలకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

**ముందు వచ్చిన వారికే ముందు..**

మరో కీలక మార్పుగా 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే, వారికే నిధుల విడుదలలో తొలి ప్రాధాన్యం లభిస్తుంది. ఏటా సుమారు ₹2,400 కోట్ల వరకు వ్యయమవుతున్న ఈ పథకంలో, నిధుల లభ్యతను బట్టి దరఖాస్తుల క్రమానుగతంగా చెల్లింపులు జరగనున్నాయి.

**కోర్టు తీర్పుతో కదలిక**

ఫీజుల బకాయిల విషయంలో కళాశాలలు కోర్టును ఆశ్రయించడం, విద్యార్థులపై ఒత్తిడి పెరగడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అడ్మిషన్ల సమయంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పూర్తి స్పష్టత ఇవ్వాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం తాజాగా కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది:

- ఆధార్ సవరణలు: విద్యార్థుల ఆధార్ కార్డుల్లో పేరు, ఇంటి పేరు తప్పులుంటే వెంటనే సరిచేసుకోవాలి.
- బయోమెట్రిక్ తప్పనిసరి: ఇపాస్ (ePass) పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థుల బయోమెట్రిక్ ధ్రువీకరణ తప్పనిసరి.
- మీసేవ అనుసంధానం: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆధార్‌తో అనుసంధానించి మీసేవ ద్వారా ధ్రువీకరించుకోవాలి.

**అడ్మిషన్ల షెడ్యూల్ నిలిపివేత**

ఈ కొత్త విద్యా విధానం మరియు ఫీజు నిబంధనలపై స్పష్టత వచ్చే వరకు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది. సవరించిన మార్గదర్శకాలతో కొత్త షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మూసీ ప్రక్షాళనకు 'మహర్దశ'.. తొలి దశకు ముహూర్తం ఖరారు!

హైదరాబాద్ : దశాబ్దాలుగా మురుగుకూపంగా మారిన మూసీ నదికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 'మూసీ పునరుజ్జీవ పథకం'లో భాగంగా తొలి దశ పనులకు సర్వం సిద్ధమైంది. దాదాపు రూ. 7,055 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించి, 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని కేబినెట్ ఉప సంఘం అధికారులకు దిశానిర్దేశం చేసింది.

* **తొలి అడుగు.. హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు**

మూసీ ప్రక్షాళనను మొత్తం ఐదు దశల్లో (55 కి.మీ) చేపట్టాలని నిర్ణయించగా, మొదటి దశలో గండిపేట (ఉస్మాన్ సాగర్), హిమాయత్ సాగర్‌ల నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 21 కిలోమీటర్ల మేర పనులు నిర్వహించనున్నారు. ఇందులోనూ జనావాసాలకు ఇబ్బంది లేని ఐదు కిలోమీటర్ల పరిధిలో తక్షణమే పనులు మొదలుపెట్టాలని మంత్రుల బృందం ఆదేశించింది.

**ఏడీబీ ఆర్థిక చేయూత..**

ఈ భారీ ప్రాజెక్టు కోసం నిధుల సమీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తొలి దశ వ్యయం రూ. 7,055 కోట్లలో సింహభాగం నిధులను ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) నుంచి రుణం రూపంలో పొందేందుకు చర్చలు సఫలమయ్యాయి. డీపీఆర్ ముసాయిదాపై బ్యాంకు ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేయడంతో, పనుల నిర్వహణకు లైన్ క్లియర్ అయింది.

**సుందరీకరణ విశేషాలివే..**

- గాంధీ సరోవర్: బాపూఘాట్ వద్ద 200 ఎకరాల్లో అద్భుతమైన జలాశయం, 153 అడుగుల మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు.
- రబ్బర్ డ్యామ్‌లు: నీటి నిల్వ కోసం, పర్యాటకులను ఆకర్షించేందుకు నదిలో వివిధ చోట్ల అధునాతన 'రబ్బర్ డ్యామ్'ల నిర్మాణం.
- మురుగు శుద్ధి: నదిలోకి ఒక్క చుక్క మురుగు నీరు చేరకుండా 2,850 ఎం.ఎల్.డి సామర్థ్యంతో భారీ ఎస్టీపీల (STP) ఏర్పాటు.
- ఈస్ట్‌వెస్ట్ కారిడార్: నదికి ఇరువైపులా స్కైవేలు, సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ వేలతో కూడిన గ్రీన్ కారిడార్ అభివృద్ధి.

## కారాగారాల నుంచి బయటకు రావడం ఇక కష్టమే!

అమరావతి/హైదరాబాద్ : శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సామాజిక బాధ్యతల పేరుతో బయటకు వచ్చే 'పెరోల్' అస్త్రాన్ని ఇకపై అంత సులభంగా వాడలేరు. జైలు గోడల మధ్య సంస్కరణలు తేవడమే కాకుండా, సమాజ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరోల్ నిబంధనలను మరింత కఠినతరం చేశాయి. ముఖ్యంగా గ్యాంగ్ రేప్, ఉగ్రవాదం, పోక్సో (POCSO) చట్టం కింద శిక్ష పడిన వారికి పెరోల్ ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నాయి.

**నిబంధనల కొరడా..**

గతంలో పెరోల్ పొందిన ఖైదీలు అడ్రస్ లేకుండా పోవడం, బయటకు వచ్చి మళ్ళీ నేరాలకు పాల్పడటం వంటి సంఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కొత్తగా అమల్లోకి వస్తున్న 'మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023-26' మార్గదర్శకాల ప్రకారం..

- నేరాల తీవ్రతే గీటురాయి: మహిళలపై లైంగిక దాడులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో నిందితులకు పెరోల్ మంజూరుపై దాదాపు నిషేధం విధించారు.
- ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ: పెరోల్‌పై బయటకు వెళ్లే ఖైదీల కదలికలను ట్రాక్ చేసేందుకు కొన్ని సందర్భాల్లో జియోట్యాగింగ్ లేదా ఎలక్ట్రానిక్ బ్రాస్‌లెట్లను ధరించాలనే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు.
- పోలీసు నివేదిక తప్పనిసరి: స్థానిక పోలీసులు ఖైదీ వల్ల సమాజానికి ముప్పు లేదని ధ్రువీకరిస్తేనే దస్త్రం ముందుకు కదులుతుంది.

దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

పెరోల్ గడువు ముగిసినా జైలుకు తిరిగి రాకుండా తప్పించుకు తిరుగుతున్న (జంపింగ్ పెరోల్) వారిపై ఇకపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని నిర్ణయించారు. ఒకసారి నిబంధనలు ఉల్లంఘిస్తే, జీవితకాలంలో మళ్ళీ పెరోల్ గానీ, ఫర్లో (Furlough) గానీ పొందే అర్హతను సదరు ఖైదీ శాశ్వతంగా కోల్పోతారు.

**బాధితుల అభిప్రాయానికీ ప్రాధాన్యం**

జాతీయ మహిళా కమిషన్ వంటి సంస్థల సిఫార్సుల మేరకు, తీవ్రమైన కేసుల్లో నిందితులకు పెరోల్ ఇచ్చే ముందు బాధితులు లేదా వారి కుటుంబ సభ్యుల అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తున్నారు. ఇది బాధితుల్లో భద్రతా భావాన్ని పెంచుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలతో జైలు పాలనలో పారదర్శకత పెరగడమే కాకుండా, నేరస్తుల్లో చట్టం పట్ల భయం పెరుగుతుందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## నగర గగనతలంపై డ్రోన్ల నిఘా..
## రేపు నిషేధాజ్ఞలు అమలు!

హైదరాబాద్: నగరంలో రేపు (ఆదివారం) డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్ క్రాఫ్ట్‌ల ఎగురవేతపై పోలీసులు పూర్తిస్థాయిలో నిషేధం విధించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటనను పురస్కరించుకుని భద్రతా దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కమిషనరేట్ల ఉన్నతాధికారులు ప్రకటించారు.

**ఎక్కడెక్కడ అంటే..?**

ప్రధాని బహిరంగ సభ జరగనున్న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాలతో పాటు ఆయన పర్యటించే మార్గాల్లో భద్రతా వలయాన్ని పటిష్టం చేశారు.

- మల్కాజ్‌గిరి పరిధిలో: బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించారు.
- సైబరాబాద్ పరిధిలో: ప్రధాని సింధు ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రానున్న నేపథ్యంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 ప్రకారం ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని, ఎవరైనా అనుమతి లేకుండా డ్రోన్లు ఎగురవేస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ శ్రీధర్ హెచ్చరించారు. నగర ప్రజలు, డ్రోన్ ఆపరేటర్లు భద్రతా సిబ్బందికి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## తమిళనాట అదే అనిశ్చితి

తమిళనాడులో రాజకీయం పూటకో మలుపు తిరుగుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే నిర్విరామంగా యత్నిస్తున్నా, ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. శుక్రవారం మరిన్ని నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీపీఐ, సీపీఎంలు తాము గెల్చుకున్న 4 సీట్లకు సంబంధించి మద్దతు లేఖల్ని శుక్రవారం మధ్యాహ్నం టీవీకేకు అందజేశాయి. సాయంత్రానికి ఐయూఎంఎల్ సైతం తాము గెలిచిన రెండు స్థానాల మద్దతు ఇవ్వనున్నట్లు టీవీకేకు లేఖ పంపింది. వీసీకే మాత్రం శనివారం లేఖ ఇస్తామని చెప్పింది. వీసీకే కాకుండా మ్యాజిక్ ఫిగర్ 118 ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ టీవీకే అధినేత విజయ్ రాత్రి గవర్నర్‌ను కలిశారు. అంతలోనే.. 'మా మద్దతు టీవీకేకి లేదు' అంటూ ఐయూఎంఎల్ ప్రకటించింది. గవర్నర్‌ను కలిసే సమయానికి సంఖ్యాబలం 116కు పడిపోవడంతో టీవీకే సందిగ్ధంలో పడింది. అంతా సవ్యంగా సాగి, సీఎంగా విజయ్ శనివారం ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశించిన టీవీకే శ్రేణులకు నిరాశే ఎదురైంది. సరిపడా సంఖ్యాబలం లేనందున గవర్నర్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. శనివారం వీసీకే మద్దతు లేఖ ఇచ్చాక మరోసారి విజయ్ గవర్నర్‌ను కలుస్తారని తెలుస్తోంది.

**అధికారంలో భాగస్వామ్యానికే డిమాండ్!**

ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే చేరువవుతున్న కొద్దీ అధికారంలో భాగస్వామ్యం కావాలని, తమకు మంత్రి పదవులు ఇవ్వాలన్న డిమాండ్లు మద్దతిచ్చిన పార్టీల నుంచి ఎక్కువవుతున్నాయి. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ 2 మంత్రి పదవుల్ని డిమాండ్ చేస్తోంది. ఇందుకు టీవీకే అంగీకరించినట్లు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటించారు. వీసీకే ఉపముఖ్యమంత్రి, మంత్రి పదవి డిమాండ్ చేస్తోంది. దీనిపై టీవీకేలో చర్చ నడుస్తోంది. మద్దతుపై వీసీకే అధినేత తిరుమావళవన్ శుక్రవారం రాత్రి మరోసారి భేటీ అయ్యారు. ఇప్పటికే ఎంపీగా ఉన్న ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, విజయ్ గెలిచిన తిరుచ్చి ఈస్ట్ స్థానం ఖాళీ అవుతుండటంతో అక్కడి నుంచి తిరుమావళవన్‌ను పోటీకి దింపాలని ఆ పార్టీ కమిటీ కోరింది. టీవీకేకు మద్దతిచ్చినా తాము డీఎంకే కూటమిలోనే కొనసాగుతామని సీపీఎం, సీపీఐ ప్రకటించాయి. అన్నాడీఎంకే ప్రభుత్వ ఏర్పాటుకు లేఖ శుక్రవారం రాత్రి ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ గవర్నర్ ఆర్లేకర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే బలాన్ని చూపని పక్షంలో.. అన్నాడీఎంకేకు అవకాశమివ్వాలని లేఖ అందించారు. తమ ఏకైక ఎమ్మెల్యే పేరుపై టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు నకిలీ లేఖ చక్కర్లు కొడుతోందని, అలాంటి లేఖ తాము ఇవ్వలేదని ప్రకటించారు. తమ పార్టీ ఎమ్మెల్యే ఆచూకీ కూడా తెలియడం లేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పళనిసామి సీఎంగా ప్రమాణస్వీకారం చేయడానికి ఆమోదించాలని కోరారు. దీనిపై గవర్నర్ స్పందన బయటికి రాలేదు.

## ఆ హైవేలో ఆగకుండా సాగిపోవచ్చు

అమరావతి: జాతీయ రహదారులపై దూసుకెళ్లే వాహనాలు.. టోల్‌ప్లాజాల వద్ద కాసేపు కూడా ఆగాల్సిన అవసరం లేకుండా ముందుకు సాగిపోయేలా బారియర్లు లేని టోల్‌ప్లాజాలు త్వరలో రాబోతున్నాయి. హైదరాబాద్‌కర్నూలుఅనంతపురం బెంగళూరు జాతీయ రహదారి 44లో ఏపీ పరిధిలోని మూడు టోల్‌ప్లాజాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఇందుకు చర్యలు చేపట్టారు. దేశంలో తొలి బారియర్ లేని టోల్‌ప్లాజాను ముంబయిదిల్లీ హైవేలో సూరత్ సమీపంలోని చొరయాసి వద్ద ఇటీవలే ప్రవేశపెట్టారు. మల్టీలేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్)గా పిలిచే ఈ విధానాన్ని దశలవారీగా అన్ని టోల్‌ప్లాజాల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌బెంగళూరు హైవే పరిధిలో కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఉన్న అమకతాడు, కాసేపల్లి, మరూరు టోల్‌ప్లాజాల్లో దీనిని అమలు చేయనున్నారు. వీటిని ఏర్పాటుచేసే బాధ్యతలు ఓ ఏజెన్సీకి అప్పగించారు.

**ఆగాల్సిన అవసరమే ఉండదు..**

ఈ విధానంలో ప్రస్తుతమున్న టోల్‌ప్లాజా వద్ద.. ఓ ఇనుప ఫ్రేమ్ ఏర్పాటుచేస్తారు. దానిపై వాహనాల నంబరు ప్లేట్‌ను గుర్తించి, రీడ్ చేసే.. ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు అమరుస్తారు. ఆర్‌ఎఫ్‌ఐడీ ఫాస్టాగ్ రీడర్‌నూ అమరుస్తారు. వాహనం ఆ టోల్‌ప్లాజా వద్దకు రాగానే తొలుత ఏఎన్‌పీఆర్ కెమెరాతో నంబరు ప్లేట్‌ను గుర్తిస్తుంది. వెంటనే ఫాస్టాగ్‌నూ రీడ్ చేసి, వ్యాలెట్ నుంచి టోల్ ఫీజు కట్ అవుతుంది. ఇదంతా సెకన్లలోనే జరిగిపోతుంది. దీనివల్ల వాహనం ఆగకుండా ఆ టోల్‌ప్లాజాల వద్ద కూడా గంటకు 80 కి.మీ. వేగంతో వెళ్లొచ్చు. వాహనానికి ఫాస్టాగ్ లేకున్నా, ఒకవేళ ఫాస్టాగ్ వ్యాలెట్‌లో నగదు లేకపోయినా.. ఈ టోల్‌ప్లాజా మీదుగా వెళ్తే నంబరు ప్లేట్ ఆధారంగా ఎలక్ట్రానిక్ నోటీసు జారీచేస్తారు. అది అందిన 72 గంటల్లో టోల్‌ఫీజు చెల్లించకపోతే, రెట్టింపు టోల్‌ఫీజు జరిమానాగా చెల్లించాలి.

## విశ్రాంత ఐపీఎస్ వినయ్‌రంజన్ రే భార్య దారుణహత్య

హైదరాబాద్, ఫిల్మ్‌నగర్: విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిమనిషిగా చేరిన నేపాలీ మహిళ కొద్దికాలంలోనే అందరి నమ్మకం చూరగొంది. ఆమె తన చోరీ పథకంలో భాగంగా నటిస్తోందన్న విషయాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. యజమాని చికిత్స నిమిత్తం మరో ఊరు వెళ్లగానే తన ఇద్దరు తోడు దొంగలను పిలిపించి ముందుగా ఇంటి పరిసరాల్లో రెక్కీ చేయించింది. అర్ధరాత్రి వేళ అదను చూసుకొని ముగ్గురూ ఇంట్లోకి ప్రవేశించారు. పడకగదిలో ఉన్న యజమానురాలి చేతులు కట్టేసి, నోట్లో వస్త్రం కుక్కి అందినకాడికి దండుకుని ఉడాయించారు. అపస్మారక స్థితికి చేరిన బాధితురాలు తెల్లారేసరికి విగతజీవిగా మారారు. విశ్రాంత పోలీసు అధికారులు ఎక్కువగా నివసించే హైదరాబాద్‌లోని ప్రశాసన్‌నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకోవడం కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 1986 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే ఉమ్మడి ఏపీలో వివిధ హోదాల్లో పనిచేసి, 2019లో డీజీ/డీజీపీ హోదాలో పదవీవిరమణ చేశారు. అనంతరం తల్లితో పాటు భార్య తనూజ(60), ఇద్దరు కుమార్తెలతో కలిసి ప్రశాసన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వృద్ధురాలైన తల్లికి సపర్యలు చేసేందుకు ఏడాది క్రితం నేపాలీ మహిళ కల్పనను పనిలో కుదుర్చుకున్నారు. ఇంట్లో ఆమెకు ఒక గదిని కేటాయించారు. రెండు నెలల క్రితం రంజన్ రే తల్లి మరణించినా కల్పన పట్ల నమ్మకం కుదరడంతో పనిలో కొనసాగించారు. మూడంతస్తుల భవనంలో.. రెండో అంతస్తులో ఇద్దరు కుమార్తెలు, మొదటి అంతస్తులో రంజన్ రే దంపతులు ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం రంజన్ రే ప్రకృతి వైద్యచికిత్స నిమిత్తం బెంగళూరు వెళ్లారు. ఇదే అదను కోసం చూస్తున్న కల్పన తన పథకం అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇద్దరు యువకులను రప్పించి ఇంట్లోకి ఎటువైపు నుంచి ప్రవేశించాలి, ఎలా పారిపోవాలనే మార్గాలపై రెక్కీ నిర్వహించారు. ఇంటి ముందు నుంచి లోపలకు వెళితే భద్రతా సిబ్బంది పసిగడతారనే ఉద్దేశంతో ఇంటి పక్కనే ఉన్న పార్కు వైపు గేటు ద్వారా లోపలికి చేరాలనుకున్నారు. కల్పన గురువారం రాత్రి ఫోన్ చేసి ఇద్దరు యువకులను ప్రశాసన్‌నగర్ రప్పించింది. వారు మరోమారు ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించి వెళ్లిపోయారు. మళ్లీ అర్ధరాత్రి దాటాక ఇంటి వద్దకు రాగానే కల్పన గేటు తీసింది. ముగ్గురూ కలిసి ఇంట్లోకి ప్రవేశించారు. 11.30 గంటల సమయంలో తనూజ బెడ్‌రూమ్‌లోకి వెళ్లారు. అలికిడికి ఆమె నిద్రలేవడంతో ముగ్గురూ కలిసి ఆమె రెండు చేతులు తాడుతో కట్టేశారు. అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కడంతో ఆమె అపస్మారకస్థితికి చేరుకున్నారు. అనంతరం అల్మారా, బీరువాల్లోని నగదు, నగలు బ్యాగులో సర్దుకుని ముగ్గురూ బయటకు వచ్చారు. తనూజ ఫోన్ స్విచ్చాఫ్ చేసి విసిరేశారు. అనంతరం గోడదూకి సమీపంలోని పార్కు ద్వారా జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్ట్‌కాలనీ వైపు పారిపోయినట్టు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఉదయం 7 గంటలైనా తనూజ నిద్ర లేవకపోవడంతో కుమార్తెలు ఆమె గదిలోకి వెళ్లి చూడగా నోట్లో గుడ్డలతో పడిపోయి ఉండటాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడినట్టు గుర్తించారు. ఇల్లు, పార్కు సమీపంలో వారు పడేసిన రెండు సెల్‌ఫోన్లు, టోపీ స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ సీవీ ఆనంద్, నగర సీపీ వీసీ సజ్జనర్, అదనపు సీపీలు శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ శ్వేత సైతం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పదికి పైగా బృందాలను రంగంలోకి దింపి నిందితుల కోసం గాలిస్తున్నారు. నేపాలీ దోపిడీ దొంగలు దేశ సరిహద్దు దాటకుండా పోలీసు బృందాలను యూపీ, బిహార్ పంపినట్టు సమాచారం. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇంట్లో కొత్తవారిని పనిలో పెట్టుకునేటప్పుడు యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మత్స్యకార సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మండలంలోని చింతలపల్లి, బాదాంపల్లి ఫిషర్‌మెన్ కోఆప్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం రోజున నిర్వహించారు.ఈ ఎన్నికలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.తిరుపతి రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.అధ్యక్షులు గా జింక లక్ష్మిరాజం,ఉపాధ్యక్షుడు గా నర్సయ్య, కార్యదర్శి గా ఎర్ర రాజన్న,సభ్యులుగా జినుక నరేష్, జినుక వెంకటేష్,జింక గంగయ్య,బొరే రాజయ్య ,కల్లెడ అచ్చయ్య, జింక రాకేష్, దుబ్బయ్య, రామయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి ఎం.తిరుపతి రెడ్డి అభినందనలు తెలిపారు.సొసైటీ అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చింతలపల్లి సర్పంచ్ పంజలా సురేష్, పంచాయతీ కార్యదర్శి రాము, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

# పొన్కల్‌బాదంపల్లి హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.జన్నారం మండలం పొన్కల్ నుండి బాదంపల్లి మధ్య రూ.1.50 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.రోడ్ల విస్తరణ, బ్రిడ్జిలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో పొన్కల్, బాదంపల్లి గ్రామాల మధ్య రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, వర్షాకాలంలో రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బెడద సత్తయ్య, నాయకులు ఇసాక్, పాదం రాకేష్, దాసరి మల్లేష్,మంద రాజేష్,అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మెడికల్ కాలేజ్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : స్వీయ గణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని, తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని జనాభా గణన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క ఐడిని పొందాలని సూచించారు, క్షేత్రస్థాయిలో ఇప్పటికే అన్ని విభాగాలలో ప్రభుత్వ, ప్రైవేటు ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ తదితర ఉద్యోగస్తులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని, మరింత విస్తృత ప్రచారం కల్పించడం కోసం శుక్రవారం స్వీయ జనన ప్రచార రథం ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఆడియో, వీడియో, వివిధ సామాజిక మాధ్యమాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ జన గణన పై విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.మహబూబాబాద్ పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఇప్పటికే దాదాపుగా పూర్తి అయిన భవనం యొక్క పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి సిద్ధం చేయాలని తెలిపారు, అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, తదితర పనులు పూర్తి కావడంతో మిగిలిన చిన్న చిన్న వర్కులను తక్షణమే పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు,ఈ కార్యక్రమాలలో కలెక్టర్ వెంట సిపిఓ శ్రీనివాసరావు, డి పి ఆర్ ఓ రాజేంద్రప్రసాద్, వెటర్నరీ జిల్లా అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, ఉద్యాన వన శాఖ అధికారి జి. మరియన్న, ఏ డి ఏ శ్రీనివాసరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ లకావత్, ఆర్ అండ్ బి ఈ ఈ, తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ జనగణనకు 10వ తేదీ చివరి అవకాశం నమోదు చేసుకోవాలి

* **తహసీల్దార్ నాగరాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు సుజాతానగర్ మండలంలోని అన్ని శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు మండల ప్రజలు జనగణన-202627లో భాగంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని చుంచుపల్లి తహసీల్దార్ నాగరాజు కోరారు. స్వీయ గణన నమోదు చేసుకునేందుకు ఈ నెల 10052026ను చివరి తేదీగా నిర్ణయించినందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్వీయ గణన నమోదు కోసం లింక్:https://se.census.gov.in

# పాడి వ్యయం తగ్గాలి.. శాస్త్రీయ పద్ధతులతోనే రైతు ప్రగతి

* **షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : పాడి పరిశ్రమలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని, శాస్త్రీయ పద్ధతులను అవలంబించినప్పుడే రైతు ఆర్థికంగా నిలదొక్కుకోగలరని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం పీర్లగూడ గ్రామంలో సర్పంచ్ షమీమ్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ ఉచిత పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పశువులకు ఆయన స్వయంగా టీకాలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పశుసంపదలో కోట్లాది దేవతలు కొలువై ఉన్నారని, పాడి పశువులే రైతు ప్రగతికి మూలాధారమని అన్నారు. గత పదేళ్ల పాలనలో పాడి పరిశ్రమ పూర్తిగా విధ్వంసమైందని, నియోజకవర్గంలో కనీసం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కూడా లేకుండా చేసిన ఘనత గత పాలకులదేనని ఆయన ఘాటుగా విమర్శించారు. రైతు బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాడి పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పశుసంవర్ధక శాఖను అన్ని విధాలా బలోపేతం చేస్తామని భరోసా ఇచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పశు వీర్య గణభివృద్ధి సంస్థ కోసం కేటాయించిన 50 ఎకరాల భూమిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే మండిపడ్డారు. త్వరలోనే ఆ సంస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. దీనివల్ల నెలకు లక్ష మేలు రకమైన పశువులను పొందే అవకాశం ఉంటుందని, తద్వారా పాడి రైతులు ఆర్థికంగా బలపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ డి. శ్రీనివాసరావు, పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ ఎస్. అరుణశ్రీ మాట్లాడుతూ.. జిల్లాలోని 30 గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా లింగ నిర్ధారిత సెమన్ ద్వారా 93 శాతం ఆడ దూడలు పుట్టేలా చేసే విధానాన్ని రైతులకు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో రూ. 3 లక్షల వ్యయంతో 2000 సెమన్ డోసులను రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులకు బహుమతులు అందజేయడంతో పాటు, స్థానిక సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీ విజయ్ కుమార్ రెడ్డి, వైద్యాధికారులు ముక్కంటి రాజు, నివేదిత, జయసుధ, వంశీకృష్ణారెడ్డి, స్థానిక నేతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వానొస్తే వరదే..!

* **కొత్తగూడెంలో జాతీయ రహదారి పనుల తీరుపై ఆగ్రహం**
* **పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో నిలిచిపోయిన పనులు**
* **బురద, నిల్వ నీటితో వాహనదారుల అవస్థలు**







ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలో జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం పోస్ట్ఆఫీస్ సెంటర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్, సెయింట్ మేరీస్ పాఠశాల సమీపంలో నెలలుగా పనులు పూర్తి కాకపోవడంతో రహదారి దయనీయంగా మారింది. వర్షం పడితే రోడ్డు మొత్తం చెరువును తలపిస్తుండగా.. వాహనదారులు ప్రాణాలను పణంగా పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన గోతులను సరిగా పూడ్చకపోవడం, తవ్విన మట్టిని రోడ్డుపైనే వదిలేయడంతో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మురుగు నీరు రహదారిపై నిలిచిపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బురద నీటిలో గోతులు కనిపించక ప్రమాదాలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి ఇదే ప్రాంతంలో ఓ రోడ్డు ప్రమాదం చోటుచేసుకోగా.. పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. రాత్రివేళల్లో లైటింగ్ సరిగా లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాద భయం వెంటాడుతోంది. పాఠశాల సమీపంలో రహదారి దెబ్బతినడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని వాపోతున్నారు. రోడ్డు భద్రత పై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నా.. ప్రమాదాలకు కారణమవుతున్న రహదారి పనులను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందిస్తారా..? పనులు ఎప్పుడు పూర్తవుతాయి..?" అంటూ స్థానికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో

# జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

* **సుజాతనగర్ పీహెచ్‌సీ, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సుజాతనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు.మొదటగా సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగాలు, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీ కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల నిర్వహణ, ల్యాబ్ సేవల పరిస్థితి, పరీక్షల ఫలితాలను రోగులకు సమయానికి అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి స్టాక్, అవసరమైన మందుల లభ్యత, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం, మొక్కజొన్న వివరాలను పరిశీలించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు.కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. మొక్కజొన్న తరలింపునకు తగినన్ని లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వివరించారు. లోడింగ్, రవాణా సమస్యల కారణంగా మొక్కజొన్న కేంద్రంలోనే నిల్వ ఉండిపోతోందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి రవాణా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పీ.ఆర్ 126 రకం ధాన్యంలో "పిన్ పాయింట్ డ్యామేజ్" ఉన్నదనే కారణంతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని స్వీకరించడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతుల ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైనన్ని గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం రవాణా, నిల్వ, లోడింగ్ తదితర అంశాలలో సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, వైద్య అధికారి డాక్టర్ రమేష్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలతో ప్రజల్లో భయాందోళన

రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : మండలంలో వరుసగా దొంగతనాలు చోటుచేసుకోవడం తో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులలో మండల కేంద్రంతో పాటు శివాజీనగర్, బానాజీపేట గ్రామాల్లో దొంగతనాలు చోటు చేసుకున్నాయి. శివాజీనగర్ గ్రామానికి చెందిన పెద్ది కుమార్ ఇంట్లో సుమారు రూ.65 వేల విలువైన బంగారాన్ని అపహరిం చినట్లు సమాచారం. బానాజీపేట గ్రామానికి చెందిన సత్యమ్మ ఇంట్లో రూ.35 వేల విలువైన బంగారం చోరీకి గురైంది. మండల కేంద్రానికి చెందిన సుధాకర్ రెడ్డి ఇంట్లో రూ.40 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఇట్టి చోరీల పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతు న్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీని మరిం త పెంచాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి వేళ సమయంలో పోలీసులు మరింత గస్తిని పెంచాలని మండల ప్రజలు పోలీసులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్యాంపు కార్యాలయంలో ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

* **కార్యకర్తలు అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలోనే మంత్రి క్యాంపు కార్యాలయంలో రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.జన్మదినం సందర్భంగా హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ లు పాలక వర్గం ,పార్టీ కార్యకర్తలు యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్యు నేతలు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికి ఆప్యాయంగా పలకరిస్తూ వారు తెచ్చిన 59 కేజీల కేక్ కట్ చేసి సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పించేలా వాహనదారులకు హెల్మెట్ లు పంపిణీ చేశారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

* **కేంద్ర మంత్రి బండి సంజయ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి నాయకుల నిరసన..**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : అక్కన్నపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం కేంద్ర మంత్రి బండి సంజయ్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తోట సరూప లు పాల్గొని మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే అనే స్థాయిని మర్చిపోయి ఇంత దిగజారు వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి నీ వెంటనే అరెస్టు చేసి సంజనకి క్షమాపణ చెప్పాలని బిజెపి పార్టీ డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి తొలగించి తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ కోరి బిజెపిని క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్ సీనియర్ నాయకులు తీగల శ్రీనివాస్ గౌడ్ ఇరుగు దిండ్ల రాజ్ కుమార్. గుగులోత్ తిరుపతి నాయక్ లక్పత్ నాయక్,జంగపల్లి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ ఎల్లం ముక్కిస సమిరెడ్డి. రెడ్డి.తీగల చంద్రం. బానోత్ అనిల్ కుమార్ లౌడియా రైనా నాయక్, కోమటి శ్రీనివాస్, బత్తిని జీవన్ గౌడ్ సంజీవరెడ్డి,నేరెళ్ల రమేష్ ఇటుకల రాజశేఖర్, శ్రీనివాస్, ఆవుల కుమార్ జీల కనకయ్య వికాస్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్లాబ్ పనులు పూర్తి.. ప్రజల్లో హర్షం

* **మున్సిపల్ చైర్మన్ కి ధన్యవాదాలు తెలిపిన వార్డు ప్రజలు**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. 34వ వార్డు హుబబ్ నగర్ , 46వ వార్డును కలుపుతూ నిర్మిస్తున్న నాలాపై వంతెనకు స్లాబ్ వేయడం పూర్తయింది. ఈ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి పర్యవేక్షించారు. రెండు వార్డుల ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడమే లక్ష్యంగా వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలంలో నాలా కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో వార్డు పెద్దలు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై అభివృద్ధి పనులు కొనసాగుతున్నందుకు చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది కి శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంలో మున్సిపాలిటీ కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

* **జోగిపేట ఏయేంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: సంక్షేమమే ధ్యేయంగా, రైతును రాజుగా చేసే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని జోగిపేట ఏయేంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి అన్నారు .శుక్రవారం అందోలు మండలం లోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం క్వింటాల్కు ఏగ్రేడ్ రకానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరను అందిస్తుందని సన్నవడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు.రైతుల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమములో వార్డు సభ్యులు మహిపాల్, మాధవ రెడ్డి, వని రమాదేవి దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మొరబోయిన కృష్ణ, రమేష్ గౌడ్, మాజీ ఎంపిటిసి బాలయ్య, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు జోగాల అంజయ్య, చెక్రాల వెంకయ్య, పంతులు ఈశ్వర్, మొరబోయిన ఈశ్వరయ్య, బీజేపీ నాయకులు కల్వమీది రమేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మన్నె దస్తయ్య, బుసనెల్లి ఆంజనేయులు, మొరబోయిన మహేష్, తలారి యాదయ్య, పుట్ల రమేష్, వని శ్రీరాములు, చాకలి ఆశయ్య, ఐకెపి సిసి సతీష్, వివోఏ రేణుక , మహిళా సమాఖ్య గ్రామ సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, సభ్యులు సుజాత, విజయ, రైతులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు

: **బండి సంజయ్ ఆగ్రహం**
- **బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురి చేశారన్న బండి సంజయ్**
- **అలా హింసించడం తమకు తెలియదన్న బండి సంజయ్**
- **వారిలా డ్రగ్స్ తీసుకోవడం తనకు తెలియదని వ్యాఖ్య**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తనకు తెలియదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారని, అలా హింసించడం తనకు తెలియదని అన్నారు. వారిలా డ్రగ్స్ తీసుకోవడం కూడా తనకు తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం తమకు తెలియదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే పరిస్థితులు మరోలా ఉంటాయని హెచ్చరించారు. వారి అహంకారం వల్లనే కేసీఆర్ ఓడిపోయి ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నప్పటికీ కేటీఆర్‌లో మార్పు రావడం లేదని వ్యాఖ్యానించారు. పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగబోయే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తోందని అన్నారు. కేంద్ర నిధులతో తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి కోసం మేం ఢిల్లీ నుంచి నిధులు తెస్తుంటే, కాంగ్రెస్ వాళ్లు మాత్రం ఇక్కడి నిధులను అధిష్ఠానానికి పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్ము ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. మోదీ తెలంగాణ అభివృద్ధి కోసమే వస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

# ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి.. అడ్డదారులు తొక్కొద్దు



వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య చేసిన ప్రసంగాలు నిరుద్యోగులకు దిశానిర్దేశం చేశాయి. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కొండా సురేఖ గట్టిగా హెచ్చరించారు. నేటి తరంలో సామాజిక మార్పులు వేగంగా వస్తున్నాయని, యువత నిబద్ధతతో పనిచేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, అడ్డదారులు తొక్కొద్దని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతలో ఉండే మానసిక ఒత్తిడిపై ఎంపీ కడియం కావ్య స్పందించారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజూ మనలో మనం యుద్ధం చేసుకుంటూ మనల్ని మనం మెరుగుపరుచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్ని విఫలయత్నాలు ఎదురైనా ఉద్యోగ ప్రయత్నాలను ఆపకూడదని, కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. "మనం తప్పు చేయనంత కాలం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపాయి. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. కలెక్టర్ సత్యశారదదేవి, ఎమ్మెల్యే నాగరాజు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమం, వరంగల్ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించారు.

# శతాధిక అవ్వ ఆవేదన.. 'అభయ'మిచ్చిన పొంగులేటి!

* **72 గంటల్లోనే కదిలిన రెవెన్యూ యంత్రాంగం..**
* **గొల్లపాడులో అధికారుల సర్వే**



పాలేరు, ప్రజా స్ఫూర్తి:ఖమ్మం రూరల్ లో గడిచిన మంగళవారం మంగళగూడెం వేదికగా జరిగిన 'ప్రజా దర్బార్'లో ఓ పండు ముసలి అవ్వ కంటతడి చూసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మనసు ద్రవించింది. "నీకు నేనున్నా బామ్మా.. ఇది నీ బిడ్డ ప్రభుత్వం" అంటూ ఆయన ఇచ్చిన భరోసా కేవలం మాటలకే పరిమితం కాలేదు.. బుల్లెట్ వేగంతో చేతల్లోకి మారింది. ఆ అభయం ఇచ్చిన 72 గంటలు గడవకముందే శుక్రవారం గొల్లపాడులో రెవెన్యూ అధికారులు వాలిపోయారు.

* **మంత్రి చొరవ.. బామ్మకు కొండంత అండ..!**

గొల్లపాడుకు చెందిన శతాధిక వృద్ధురాలు వెలుతురు భద్రమ్మ దశాబ్దాలుగా తన భూమి సమస్య పరిష్కారం కాక ఆఫీసుల చుట్టూ తిరుగుతోంది. మంగళవారం జరిగిన ప్రజా దర్బార్‌లో ఆమె తన గోడును మంత్రికి వినిపించుకుంది. భద్రమ్మ దీనస్థితిని గమనించిన మంత్రి పొంగులేటి అక్కడికక్కడే అధికారులను ఆదేశించి.. "ఈ వయసులో ఆ బామ్మను ఇబ్బంది పెట్టవద్దు, వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కారం చూపండి" అని గట్టిగా చెప్పారు. వృద్ధురాలి విన్నపానికి మంత్రి ప్రాధాన్యతనివ్వడం అక్కడి వారందరినీ ఆకట్టుకుంది.

* **మూడు రోజుల్లోనే క్షేత్రస్థాయికి అధికారులు...**

మంత్రి ఆదేశించిన 72 గంటల్లోనే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, సర్వేయర్ సతీష్ రెడ్డి బృందం గొల్లపాడులోని భద్రమ్మ భూమి వద్దకు చేరుకుని, వివాదంలో ఉన్న భూమిని క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన సరిహద్దులను సరిపోల్చారు. ఏళ్ల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉందనే కోణంలో పూర్తి వివరాలు సేకరించారు.

* **మంత్రి మాట.. ప్రజల్లో కోటి ఆశలు..!**

మంత్రి హామీ ఇస్తే అధికారులు ఎంత వేగంగా స్పందిస్తారో ఈ ఘటనతో స్పష్టమైంది. బామ్మ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు అడుగులు వేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క 104 ఏళ్ల వయసులో భద్రమ్మ చూపుతున్న పట్టుదల, మరోపక్క సామాన్యుల కోసం మంత్రి చూపుతున్న చొరవ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం విచారణ ప్రక్రియ వేగవంతం కావడంతో, త్వరలోనే తన భూమికి శాశ్వత పరిష్కారం దొరుకుతుందని భద్రమ్మ ఆశాభావం వ్యక్తం చేస్తుంది.

# జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయం

* **జాయింట్ కలెక్టర్ వై అశోక్ రెడ్డి..**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనెంట్ జన్మదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా రెడ్ క్రాస్ డే ని జరుపుకున్నారు. శుక్రవారం జిల్లా రెడ్ క్రాస్ భవన్ నల్గొండ నందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ వై అశోక్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ పి.అరుణ లు ముఖ్య అతిథులుగా పాల్గొని రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనెంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం జాయింట్ కలెక్టర్ వై అశోక్ రెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ వ్యవస్థాపకుని జన్మదిన సందర్భంగా రెడ్ క్రాస్ డే జరుపుకోవడం అభినందనీయమని అదేవిధంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని గత జనవరిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రణామ్ డే కేర్ సెంటర్ నీ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందని చాలా చక్కగా జిల్లా రెడ్ కార్డ్ చైర్మన్ గోలి అమరేందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని ముఖ్యంగా ఎవరైతే వయోవృద్ధులు వారి సమస్యలు గురించి జిల్లా అధికారుల దగ్గరికి వస్తారో వారు ఇక్కడ స్వేద తీర్చుకునే అవకాశం ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు అనంతరం వారి చేతుల మీదుగా 100 మంది వయోవృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ లేబర్ అరుణ జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు ట్రెజరర్ డా!మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మేనేజింగ్ కమిటీ సభ్యులు ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి సురెడ్డి సరస్వతి రెడ్ క్రాస్ యూత్ వాలంటీర్స్ అంజయ్య ఊర శివ సాయి నేతి విప్లవ కుమార్ అసిస్టెంట్ ఆఫీసర్ రాజు నాగిరెడ్డి సీనియర్ సిటిజన్స్ సముద్రాల మల్లికార్జున్ వెంకట్ రెడ్డి సుదర్శన్ రెడ్డి రెడ్ కాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎలాంటి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

* **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రానున్న జులై 15 వరకు జిల్లాలో ఎలాంటి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆర్డబ్ల్యూఎస్ ,మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం అయన ఉదయాదిత్య భవన్లో జిల్లాలోని తాగునీటి పరిస్థితిపై సమీక్ష తాగునీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యను అక్కడికక్కడే పరిష్కరించాలని పరిష్కారం కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తాగునీటి విషయంలో పూర్తి భరోసాను ప్రజలకు కల్పించాల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారులపై ఉందని ఆయన అన్నారు .ఎక్కడ తాగునీరు వృధా కాకూడదని, ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా బల్క్ సరఫరా లో సమస్యలు, అలాగే రిపేరీలు ఉన్నట్లయితే వెంటనే సమస్యలు పరిష్కరించాలని, తాగునీటిని పూర్తిస్థాయిలో పరీక్ష నిర్వహించిన తర్వాతే సరఫరా చేయాలని, ఇందుకు గాను ప్రతి మున్సిపాలిటీకి తాగు నీటి టెస్టింగ్ కిట్లను ఇవ్వడం జరిగిందని చెప్పారు . ఏ ఈ లు గ్రామాలలో సర్పంచులతో అనుసంధానంలో ఉండి ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా చిన్న చిన్న లీకేజీలు లేదా మరమ్మతులు ఏర్పడితే వెంటనే అరికట్టాలని, పెద్ద సమస్యలు వస్తే తమ దృష్టికి తేవాలన్నారు. తాగునీటి పై పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలకు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవడంతో పాటు, వివరణలు ఇవ్వాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా పత్రికల్లో వచ్చిన వార్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షించి అందు గల కారణాలను తెలుసుకున్నారు. మిషన్ భగీరథ ఎస్ ఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు చూడాలని, ఎక్కడైనా సమస్యలు వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని గ్రిడ్ వాటర్ రాకపోతే అద్దె బోర్ల ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా తాగునీరు అందించాలని చెప్పారు.ప్రజారోగ్య ఎస్ ఈ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈ ఈ శాంత కుమారి, జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్, మిషన్ భగీరత ఈ ఈ లు,డి ఈ లు,ఏ ఈ లు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# వికారాబాద్ జిల్లా ఎడ్యుకేషనల్ హబ్ గా కొండంగల్

**: సీఎం రేవంత్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , వికారాబాద్ : దేశానికే మోడల్ గా కొండంగల్ ను తీర్చి దిద్దుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ లో 110 కోట్లతో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణా నికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ...లగ చర్లను ఎడ్యుకేషనల్ హబ్ గా మారుస్తున్నా మని చెప్పారు.తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన కొడం గల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా, ఒక బంగారు తునక గా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. కొడంగల్‌లో ఆయన పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భం గా ఆయన భావోద్వేగ పూరితమైన ప్రసంగం చేశారు.కొడంగల్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం కేవలం తెలంగాణకే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర భక్తులకు కూడా 'పేదల తిరుపతి'గా విరాజిల్లు తోందని సీఎం అన్నారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో కొడంగల్ రూపురేఖలు మారిపోతాయని సీఎం స్పష్టం చేశారు. మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్, పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసి, రాష్ట్రావ్యాప్తంగా విద్యార్థులు ఇక్కడికి వచ్చేలా తీర్చిదిద్దుతా మన్నారు.లగచర్ల దగ్గర 2300 ఎకరాల్లో ఇండస్ట్రియ ల్ పార్క్, రాబోయే ఆరు నెలల్లో సిమెంట్ పరిశ్రమ పనులు ప్రారంభిస్తా మని, చెప్పారు.

## ఐపీఎస్ అధికారి భార్య హత్య.. నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి నిందితుల పరారీ

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్‌రే భార్య తనూజ హత్య కేసులో పోలీసుల విచారణ కొనసాగుతోంది. పది ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నారు. లఖ్‌నవూ, ముంబయి, నేపాల్ సరిహద్దుకు ఆయా బృందాలు బయల్దేరాయి. హత్య అనంతరం నిందితులు నాంపల్లి వెళ్లి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. ఆటోలో నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితులు.. తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కి వెళ్లిపోయినట్లు నిర్ధరించారు. తనూజ హత్యలో పనిమనిషి కల్పన కీలకపాత్ర పోషించినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మరో ఇద్దరితో కలిసి పక్కా ప్రణాళికతో ఆమె దారుణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. తనూజను హత్య చేసిన అనంతరం ఇంట్లోని బంగారం, నగదు తీసుకుని ముగ్గురు నిందితులు పరారయ్యారు.

# తెలంగాణకు జలద్రోహం చేసిన పాలకులను కిలోమీటర్ లోతున బొంద పెడుతాం

* **తెలంగాణ రక్షణ సేన ముఖ్యమంత్రి సొంత జిల్లాలో కాంగ్రెస్‌కు హెచ్చరిక**
* **చౌదరిగూడెం సభలో గర్జించిన పార్టీ అధినేత్రి కవిత**




ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : నీళ్ల కోసమే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో, స్వరాష్ట్రం సిద్ధించిన పన్నెండేళ్ల తర్వాత కూడా సాగునీటి కోసం రైతులు ఆవేదన చెందడం చారిత్రక విషాదమని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు జలద్రోహం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని కిలోమీటర్ లోతున బొంద పెట్టడం ఖాయమని ఆమె తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం చౌదరిగూడెం మండల కేంద్రంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సాధన భారీ బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. అంతకముందు చౌదరిగూడ మండల కేంద్రంలో మొట్టమొదటి పార్టీ జెండాను పార్టీ శ్రేణులతో కలిసి ఎగరావేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఆమెకు డప్పు వాయిద్యాలతో, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి సభ ప్రాంగణంలోకి తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె సభను ఉద్దేశించి మాట్లాడుతూ... పాలమూరుకు పట్టిన శని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే అని, ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులను నిందించి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, పదేళ్ల పాలనలో తెలంగాణ రైతుల గొంతు కోసిందని ఆమె ధ్వజమెత్తారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరుతో రూ. 33 వేల కోట్లు ఖర్చు చేసిన గత ప్రభుత్వం, కనీసం 33 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కేవలం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, కమిషన్ల కోసమే ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో జూరాల సోర్స్ పాయింట్‌ను శ్రీశైలంకు మార్చారని, దీనివల్లే నేడు ఆంధ్రాతో నిత్యం నీటి పంచాయితీలు వస్తున్నాయని ఆమె దుయ్యబట్టారు.

* **సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు**

నల్లమల పులి బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన సొంత ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె ప్రశ్నించారు. పాలమూరు ప్రజలు కాంగ్రెస్‌కు 12 సీట్లు కట్టబెడితే, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని విమర్శించారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్ల కక్కుర్తిలో పడి ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ పాపంలో వారందరికీ భాగస్వామ్యం ఉందని ఆరోపించారు.

* **దసరా గడువు - పాదయాత్ర అల్టిమేటం**

ప్రభుత్వానికి స్పష్టమైన అల్టిమేటం జారీ చేస్తూ రాబోయే దసరా పండుగ నాటికి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో దసరా మరుసటి రోజు నుంచే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ భారీ పాదయాత్ర చేపడతామని ఆమె సవాల్ విసిరారు. తెలంగాణలో నీటి అన్యాయాన్ని సరిచేయడమే లక్ష్యంగా తమ పార్టీ పుట్టిందని ఆమె స్పష్టం చేశారు.

* **బీఆర్ఎస్ పార్టీది క్షమించలేని దుస్థితి**

పదేళ్లు పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని ఆమె ఏద్దేవా చేశారు. ఆ పార్టీలో ఓ గుంట నక్క ఉందని, గతంలో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసి కాంట్రాక్టర్లతో కుమ్మకై అటు పార్టీని, ఇటు రాష్ట్ర ప్రజలను మోసం చేశారాని విమర్శించారు. శ్రీశైలంలో 140 మీటర్ల నుంచి తీసుకోవాల్సిన నీటిని 50 మీటర్లకు కుదించి ఉమ్మడి పాలమూరుప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని అప్పటి మంత్రిపై ఆమె నిప్పులు చెరిగారు. పదేళ్లలో బిఆర్ఎస్, రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నుంచి తట్టెడు మట్టి కూడా తీయలేకపోయారని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి లక్షల ఎకరాలకు నీటిని అందజేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

* **తెలంగాణ రక్షణ సేన భవిష్యత్తు ప్రణాళిక**

తమ పార్టీ అధికారంలోకి వస్తే సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇరిగేషన్, వాటర్ మేనేజ్ మెంట్ పర్యవేక్షణకు ప్రత్యేక వాటర్ కమిషన్' ఏర్పాటు చేస్తామన్నారు. చెరువుల నుంచి నీరు నేరుగా రైతుల పొలాలకు వెళ్లేలా పర్యవేక్షించేందుకు ప్రతి 3000 ఎకరాలకు ఒక లష్కర్లను నియమిస్తాం అన్నారు. అత్యంత ఎత్తైన ప్రాంతమైన లక్ష్మీదేవి పల్లిలో రిజర్వాయర్ నిర్మించి, రంగారెడ్డికి 4 లక్షలు, మహబూబ్ నగర్ కు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

* **బీజేపీ తీరుపై ఆగ్రహం.. మోడీకి డిమాండ్లు**

పాలమూరుకు జాతీయ హోదా విషయంలో బీజేపీ కూడా తెలంగాణను మోసం చేస్తోందని ఆమె విమర్శించారు. ఈ నెల 10న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోడీని స్థానిక ఎంపీ అరుణమ్మ కలిసి, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు, జనగణనలో బీసీ కాలమ్, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేయాలన్నారు. తెలంగాణ రక్షణ సేన చేపట్టిన ఈ నీటి ఉద్యమానికి రైతులు, యువత, మేధావులు మద్దతు తెలపాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సభలో పార్టీ ముఖ్య నాయకులు సేనాపతి, వరలక్ష్మి, ముస్తఫా, చీమల రమేష్, పాండురంగారెడ్డి, బాలాజీ ఉదయ్, రూప్ సింగ్ నాయక్, రంజిత్ కుమార్, శ్రీనివాస్, సైదులు యాదవ్, మల్కాజ్గిరి వెంకట్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా, 20 నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# హంటావైరస్.. భారత్‌కు తక్షణ ముప్పు లేదు - NIV



క్రూజ్ నౌక ఎంవీ హిండియస్‌లో హంటా వైరస్ వ్యాప్తి కలవరపాటుకు గురిచేస్తోంది. ముఖ్యంగా నౌకా సిబ్బందిలో ఇద్దరు భారతీయులు ఉండటం మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఈ పరిణామాలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ నవీన్ కుమార్ స్పందించారు. ఈ వైరస్ కేసులు అక్కడక్కడ కనిపిస్తున్నాయని, వైరస్‌తో భారత్‌కు తక్షణ ముప్పు ఏమీ లేదన్నారు. ప్రస్తుతానికి సామూహిక వ్యాప్తికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవన్నారు. ''ఈ వైరస్ మానవుల నుంచి మానవులకు సంక్రమించడం చాలా అరుదు. ఆసియా, ఐరోపా దేశాల్లో వెలుగు చూసే ఈ వైరస్ మానవుల మధ్య సోకదు. ఆండెస్ వైరస్ వంటి కొన్ని దక్షిణ అమెరికా జాతుల్లో మాత్రమే ఇలా వ్యాప్తిచెందినట్లు రికార్డులున్నాయి'' అని ఎన్ఐవీ డైరెక్టర్ వెల్లడించారు.

**ఆ ప్రాంతాలకు వెళ్లొద్దు..**

ఇది కొవిడ్, ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కాదని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. తొలుత ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయని, వైరస్ సోకిన ఒకటి నుంచి ఐదు వారాల్లో లక్షణాలు బయటపడతాయన్నారు. దేశంలో ఇటువంటి అనుమానిత వైరస్ కేసులను గుర్తించడానికి అవసరమైన ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. నౌకలు, గిడ్డంగులు, స్టోరేజీ కేంద్రాలు, గాలి ప్రసరణ సరిగాలేని ప్రదేశాల్లో పనిచేసే వ్యక్తులు పరిశుభ్రత పాటించాలని, ఎలుకలు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని ఎన్ఐవీ డైరెక్టర్ సూచించారు.

**మరిన్ని కేసులు..**

ఇది తీవ్ర పరిణామమే అయినప్పటికీ.. దీని వల్ల ప్రజారోగ్య ముప్పు తక్కువగానే ఉన్నట్లు అంచనా వేస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్ పేర్కొన్నారు. అయితే, వైరస్ పొదిగే కాలాన్ని దృష్టిలో ఉంచుకొని.. మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి మరియా వాన్ మాట్లాడుతూ.. ఈ వైరస్ భిన్నంగా వ్యాప్తి చెందుతోందని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

## అన్నాడీఎంకేను ఆహ్వానించండి..
# గవర్నర్‌కు దినకరన్ లేఖ



చెన్నై: తమిళనాడులో రాజకీయ పరిణామాలు మరింత ఉత్కంఠగా మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని కోరినా.. ఈ అంశంపై లోక్‌భవన్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఈ క్రమంలో ఏఎంఎంకే పార్టీ ప్రధాన కార్యదర్శి దినకరన్ గవర్నర్‌కు లేఖ రాశారు. అన్నాడీఎంకేకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఏర్పాటుకు మాజీ సీఎం పళనిస్వామిని ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల వెలువడిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఏఎంఎంకే ఒక స్థానంలో గెలిచిన విషయం తెలిసిందే.

**టీవీకేకు మద్దతు లేఖ పంపాం: వీసీకే**

ప్రభుత్వ ఏర్పాటులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతిస్తున్నట్లు వీసీకే వెల్లడించింది. ఈ మెయిల్ ద్వారా తమ లేఖను పంపినట్లు తెలిపింది. ఈ మేరకు వీసీకే పార్టీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. తమ మద్దతుకు సంబంధించి అధికారిక ప్రకటన శనివారం చేస్తామని మరో ట్వీట్‌లో పేర్కొంది. వీసీకే, టీవీకే శ్రేణులంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది.

# ఈ చిన్న తప్పిదమే.. విజయ్‌ని తిప్పలు పెట్టిందా..?



పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నప్పటికీ.. మెజార్టీ లెక్కలు విజయ్‌ను తిప్పలు పెట్టాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం లేక.. ఇప్పటికే రెండుసార్లు గవర్నర్ నుంచి తిరస్కరణ ఎదురైంది. ఎట్టకేలకు కాంగ్రెస్ సహా చిన్న పార్టీల మద్దతు కూడగట్టుకుని ముచ్చటగా మూడోసారి గవర్నర్‌ను కలిసేందుకు సిద్ధమయ్యారు. అయితే, విజయ్ (Vijay) చేసిన ఓ చిన్న తప్పిదం కారణంగా.. ప్రభుత్వ ఏర్పాటులో ఆయన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తమిళనాడులో మొత్తం 234 శాసనసభ స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే (TVK) పార్టీ 108 స్థానాల్లో గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, విజయ్ రెండు చోట్ల పోటీ చేయడంతో ఈ సంఖ్యాబలం 107కు తగ్గింది. మెజార్టీ మార్క్‌ను చేరుకోవాలంటే ఇంకా 11 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరమైంది. ఈ క్రమంలో 5 స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో సంఖ్యా బలం 112కు పెరిగింది. ఈ పరిణామాల అనంతరం మే 6న విజయ్ లోక్‌భవన్‌కు వెళ్లి రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని కోరారు. ఇందుకోసం టీవీకేతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంతకాలను కూడా సమర్పించారు. రెండోసారి గవర్నర్‌తో సమావేశమైనప్పుడు కూడా తమ సంఖ్యాబలాన్ని ఇలాగే చూపించుకున్నారు. ఇదే ఆయన చేసిన పొరపాటు అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాస్తవానికి విజయ్ తొలుత తమ టీవీకే పార్టీ ఎమ్మెల్యేల సంతకాలను మాత్రమే సమర్పించి ఉండాల్సిందని చెబుతున్నారు. అప్పుడు అతిపెద్ద పార్టీ టీవీకేను గుర్తించి.. ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ సమ్మతించేవారు. ఆ తర్వాత శాసనసభలో బలపరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చేదని చెబుతున్నారు. అయితే, విజయ్ తన అభ్యర్థన పత్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంతకాలను కూడా సమర్పించడంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాననే సంకేతాలిచ్చినట్లయ్యింది. దీని వల్లే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో రావాలని గవర్నర్ ఆయనను తిప్పి పంపి ఉంటారని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లో పెద్దగా అనుభవం లేకపోవడమే విజయ్ పొరపాటుకు కారణమైందని భావిస్తున్నారు. గవర్నర్ తిరస్కరించడంతో ప్రభుత్వ ఏర్పాటు కోసం విజయ్ ముమ్మర ప్రయత్నాలు చేశారు. వామపక్షాలు, చిన్న పార్టీలతో సంప్రదింపులు జరిపారు. అవి ఫలించి సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీలు విజయ్‌కు మద్దతిచ్చేందుకు ముందుకొచ్చాయి. దీంతో టీవీకే సంఖ్యాబలం 118కు పెరిగినట్లయ్యింది.

# ఇకపై బెంగాల్ అభివృద్ధి మా బాధ్యత: అమిత్ షా



కేంద్రమంత్రి అమిత్ షా టీఎంసీ అధినేత మమతా బెనర్జీపై తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్ ఐదు దశాబ్దాల పాటు ప్రజాస్వామ్య క్షీణత, శాంతిభద్రతల పతనంతో తీవ్ర సమస్యలు ఎదుర్కొందని అన్నారు. టీఎంసీ ఓటమితో అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. సువేందు అధికారి మమతను ఆమె సొంత నియోజకవర్గంలోనే ఓడించారని పేర్కొన్నారు. తాము సాధించిన ఈ అసాధారణ విజయాన్ని బెంగాల్ ఎన్నికల చరిత్రలోనే కీలక మలుపుగా అభివర్ణించారు. ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఇప్పుడు పార్టీపై ఉందని.. ఇక బెంగాల్ అభివృద్ధి బాధ్యత తమదేనని అన్నారు. శాంతియుతంగా పోలింగ్ నిర్వహించినందుకు ఎన్నికల సంఘం, భద్రతా దళాలు, రాష్ట్ర అధికారులను అమిత్ షా అభినందించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వరుస ఓటములు ఎదుర్కొంటోందని.. దీనిపై ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆత్మపరిశీలన చేసుకోని నాయకులు ఎప్పటికీ నిజమైన విజయాన్ని సాధించలేరని పేర్కొన్నారు. సువేందు నేతృత్వంలోని నూతన ప్రభుత్వం బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు

# ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై



దిల్లీ: ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. ఇక కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసినట్లు వెల్లడించింది. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి తాజాగా లేఖ రాశారు. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోలేమని అందులో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగడాన్ని ఖండించారు. కూటమికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని.. పాత రాజకీయ స్వభావాన్ని ఆ పార్టీ మార్చుకోలేదని ఆక్షేపించారు. కూటమి వల్లే కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ద్రోహాన్ని అధిగమించి బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం వ్యతిరేకించారు. స్వలాభాల కోసం కూటమి నేతలను వదులుకోవడం సరైన చర్య కాదన్నారు.

# పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకొన్న 1,500 నౌకలు



ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ వల్ల పెద్ద సంఖ్యలో వాణిజ్య నౌకలు, ఆయిల్ ట్యాంకర్లు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయాయి. వీటిలో చాలావరకు నౌకలు, ట్యాంకర్లు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయి. దాదాపు 1,500 నౌకలు ఆగిపోయినట్లు యూఎన్ ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ చీఫ్ వెల్లడించారు. వాటిలో 20,000 మంది నావికులు ఉన్నట్లు తెలిపారు. రెండు నెలలకు పైగా వారు అందులోనే చిక్కుకుపోయారన్నారు. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతాల్లో ఇప్పటివరకు 30 నౌకలపై దాడులు జరగ్గా.. 10 మంది సెయిలర్లు మరణించినట్లు పేర్కొన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే కొంతకాలం పాటు గల్ఫ్ దేశాలకు నౌకలను పంపకుండా ఉండాలని ఐఎంవో అధిపతి ప్రపంచ దేశాలకు సూచించారు. కాగా హార్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా తరలించేందుకు చేపట్టిన నావికాదళ ఆపరేషన్‌ను అమెరికా తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు సౌదీఅరేబియా ప్రభుత్వం నిరాకరించడంతోనే అగ్రరాజ్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# కెంపుల లోయలో.. 11వేల క్యారెట్ల రూబీ లభ్యం



మయన్మార్‌లో భారీ కెంపు (Ruby) లభ్యమైంది. మండలే నగరంలోని మొగాక్ సమీపంలో 11వేల క్యారెట్ల (2.2కేజీలు) బరువున్న కెంపును గుర్తించినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. ఇలా లభ్యమవడం అరుదైన విషయమని అభివర్ణించారు. మయన్మార్‌లోని మొగాక్ ప్రాంతానికి కెంపుల లోయ అని పేరు. ఇక్కడ 1990లో 496 క్యారెట్లు, 1996లో 21,450 క్యారెట్లు, 2022లో 2,789 క్యారెట్ల బరువున్న కెంపులు లభించాయి. 1996లో దొరికిన రూబీ కంటే ప్రస్తుతం లభ్యమైన దాని విలువ ఎక్కువగా ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ఆ విలువ ఎంత ఉండొచ్చనేది మాత్రం అధికారులు వెల్లడించలేదు. 2015లో జరిగిన ఒక వేలంలో 25.59 క్యారెట్ల మయన్మార్ రూబీ 30.33 మిలియన్ల డాలర్లు(రూ.286కోట్లు) పలకడం గమనార్హం.

# అవును.. పాకిస్థాన్‌కు సాయం చేశాం చైనా



గతేడాది మే నెలలో భారత్‌తో ఘర్షణల సమయంలో పాకిస్థాన్‌కు క్షేత్రస్థాయిలో సాంకేతిక సాయం అందించినట్లు చైనా తొలిసారి ధ్రువీకరించింది. ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఆఫ్ చైనా (ఏవీఐసీ)కు చెందిన ఓ ఇంజినీర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియా సీసీటీవీ ఓ కథనం ప్రసారం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'కు ఏడాదైన వేళ చైనా నుంచి ఈ స్పందన రావడం గమనార్హం. చైనాలో ఏవీఐసీ అనుబంధ సంస్థ ఉత్పత్తి చేసిన జే10సీఈ యుద్ధ విమానాలను పాకిస్థాన్ సైన్యం వినియోగిస్తోంది. అయితే, యుద్ధ పరిస్థితుల్లో తమ సపోర్టు బృందం పనిచేసిందని చైనా ఇంజినీర్ పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలో సహాయక స్థావరంలో పని చేశామన్నారు. తమ వైమానిక సామర్థ్యాలకు అనుగుణంగా తమ పరికరాలు పనిచేసేలా చూడటం, క్షేత్రస్థాయిలో మరింత మెరుగ్గా పనిచేయాలనే తపన తమ బృందాన్ని ముందుకు నడిపించిందని తెలిపారు.

# ఆ 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి: హార్మూజ్‌పై ఇరాన్ నిబంధనలు



హార్మూజ్ జలసంధిలో ఇరాన్ తన సొంత నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మొత్తం వ్యవహారాలను చూసేందుకు పర్షియన్ గల్ఫ్ స్ట్రేట్ అథారిటీ (PGSA)ని ఏర్పాటుచేసింది. ఇక్కడినుంచి పయనించే నౌకలు కచ్చితంగా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిందేనని ఇరాన్ డిమాండ్ చేస్తోందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. సరకు వివరాలు, యాజమాన్యం, సిబ్బంది జాతీయత వంటి ప్రశ్నలు అడుగుతోంది. ఈ కొత్త నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే.. డ్రోన్, క్షిపణి దాడుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆ నౌకలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించింది. ఫిబ్రవరి 28న ఘర్షణలు ప్రారంభమైన తర్వాత నుంచి హార్మూజ్‌కు కొత్త నిబంధనలు తీసుకొస్తామని ఇరాన్ (Iran) హెచ్చరిస్తోంది. అన్నట్టుగానే పీజీఎస్ఏ ఏర్పాటుచేయడాన్ని టెహ్రాన్ తీసుకున్న ప్రధాన చర్య అని విశ్లేషణలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటివరకు అంతర్జాతీయ రవాణామార్గ నియమాల ఆధారంగా హార్మూజ్ జలసంధిలో రాకపోకలు నడిచేవి. ఇరాన్ నిబంధనల ప్రకారం.. నౌకలకు సంబంధించిన గుర్తింపు నంబర్లు, వాటి మునుపటి పేర్లు వంటి వివరాలను పీజీఎస్ఏకు మెయిల్ చేయాల్సిఉంది. ఈ పర్యవేక్షణతో పాటు భారీగా టోల్ ఫీజ్‌ను విధించడం ప్రారంభించిందని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. నౌకల సురక్షిత ప్రయాణానికి రూ.18 కోట్ల వరకు వసూలుచేస్తున్నట్లు తెలుస్తోంది. హార్మూజ్‌లో ఉద్రికత్తలు అంతర్జాతీయ ఇంధన సంక్షోభానికి దారితీస్తున్నాయి. ఈ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు జలసంధి మీదుగా రోజుకు 120 నౌకలు వెళ్లేవి. మే నెలలో ఆ సంఖ్య 40కి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు..

భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో నష్టపోయిన మార్కెట్లు

516 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్, 150 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

భారీగా పతనమైన బ్యాంకింగ్ షేర్లు, ఆదుకున్న ఐటీ రంగం

100 డాలర్లు దాటిన బ్రెంట్ ముడిచమురు ధర




**ముంబై:** అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో మదుపరులు అన్ని రంగాల్లో అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 516.33 పాయింట్లు నష్టపోయి 77,328.19 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 150.50 పాయింట్లు తగ్గి 24,176.15 వద్ద ముగిసింది.

ఈ అమ్మకాల ఒత్తిడికి ప్రధానంగా బ్యాంకింగ్ షేర్లు నాయకత్వం వహించాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, బ్యాంక్ సూచీలు భారీగా నష్టపోయాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆర్థిక రంగ షేర్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

ఎస్‌బీఐ, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే, ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్ల నష్టాలు కొంతమేర తగ్గాయి. టైటాన్, అపోలో హాస్పిటల్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మాత్రం మార్కెట్ బలహీనతను తట్టుకుని లాభపడ్డాయి.

నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,250-24,300 స్థాయి తక్షణ నిరోధకంగా ఉంది. దీనిని దాటితేనే మార్కెట్లో సానుకూలత పెరుగుతుంది. అదే సమయంలో, 24,100-24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని వారు అంచనా వేస్తున్నారు.

మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 0.66% పెరిగి బ్యారెల్‌కు 100.72 డాలర్లకు చేరింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా, ఇరాన్ మధ్య వివాదం మళ్లీ మొదలవ్వడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళన నెలకొంది. ఇది ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆరు రెట్లు పెరిగిన ఏఐ వినియోగం..

20% ఉద్యోగులకు లేఆఫ్‌లు




**న్యూఢిల్లీ:** ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ 'క్లౌడ్‌ఫ్లేర్' తమ లేఆఫ్‌లను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ సిబ్బందిని 20శాతం మేర తగ్గించుకుంటున్నట్లు వెల్లడించింది. కంపెనీలో ఏఐ వినియోగం భారీగా పెరగడం వల్లే ఈ తొలగింపుల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపింది. ఈమేరకు ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో పంపింది. దాదాపు 1100 మందికి పైగా ఉద్యోగులను 'క్లౌడ్‌ఫ్లేర్' తొలగించనుంది.

"గత మూడు నెలల్లో కంపెనీ ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగింది. ఇంజినీరింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్ విభాగాల్లో నిత్యం వేల సంఖ్యలో ఏఐ ఏజెంట్లను వినియోగిస్తున్నాం. ఏఐ సామర్థ్యాన్ని మరింత అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతోనే కంపెనీ ఈ పునర్ వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. అంతేగానీ, ఉద్యోగుల పనితీరుతో దీనికి ఎలాంటి సంబంధం లేదు" అని క్లౌడ్‌ఫ్లేర్ తమ మెమోలో పేర్కొంది. లేఆఫ్‌లకు గురైన ఉద్యోగులకు పరిహార ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

కాగా.. క్లౌడ్‌ఫ్లేర్ గురువారమే తన తొలి త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. ఇందులో వాల్‌స్ట్రీట్ అంచనాలను మించి కంపెనీ రాణించింది. అయితే, కొన్ని గంటలకే ఈ లేఆఫ్‌ల వార్తలు బయటకు రావడంతో.. కంపెనీ షేర్లు భారీగా పడిపోయాయి. ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే క్లౌడ్‌ఫ్లేర్ షేరు ధర దాదాపు 14శాతం కుంగడం గమనార్హం.

150 ఎయిర్‌బస్ విమానాల కోసం

## ఎయిరేషియా భారీ ఆర్డర్




**కౌలాలంపూర్:** చౌక ధరల విమానయాన సంస్థ ఎయిరేషియా, ఎయిర్‌బస్ ఏ220-300 మోడల్ విమానాలు 150 సమీకరించేందుకు ఆర్డర్ ఇచ్చింది. ఈ లావాదేవీ విలువ 19 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.79 లక్షల కోట్లు). ఏ220 విమానాల కోసం ఒక సంస్థ ఇచ్చిన అతిపెద్ద ఆర్డరు ఇదే. కెనడాలోని క్యూబెక్, మిరాబెల్‌లో ఉన్న ఎయిర్‌బస్ ఫ్యాక్టరీలో గురువారం ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ పాల్గొన్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలను తట్టుకోవడానికి.. విమాన ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకునే ఏ220 విమానాలు కొనుగోలు చేయాలని ఎయిరేషియా నిర్ణయించింది. ఈ విమానాలు తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేస్తాయి. 160 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ విమానాలను, తక్కువ మంది ప్రయాణికులతో కూడా లాభదాయకంగా నడపొచ్చు. చిన్న నగరాలు, సెకండరీ హబ్‌లకు విమాన సేవలు ప్రారంభించడానికి వీలుపడుతుందని సంస్థ పేర్కొంది. భవిష్యత్తులో ఈ ఆర్డరును 300 విమానాల వరకు పెంచుకునే సౌలభ్యం ఎయిరేషియాకు ఉంది.

ఈ విమానాల డెలివరీ 2028 నుంచి ప్రారంభమవుతుంది. ఆగ్నేయాసియా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లోని గమ్యస్థానాలకు ఏ220 విమానాలను ఎయిరేషియా నడపనుంది. మధ్యస్థ దూర మార్గాలకు ఏ320, ఏ321 విమానాలను, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా వంటి సుదూర మార్గాలకు ఏ330 విమానాలను కేటాయించే అవకాశం ఉందని ఎయిరేషియా సహవ్యవస్థాపకుడు, సలహాదారు టోనీ ఫెర్నాండెజ్ పేర్కొన్నారు. ఈ భారీ ఆర్డరుతో ఎయిర్‌బస్ ఏ220 విమానాల మొత్తం ఆర్డర్ల సంఖ్య 1,000 మార్కును దాటింది. 2026 మార్చి వరకు చూస్తే, 25 విమానయాన సంస్థలకు 501 ఏ220 విమానాలను ఎయిర్‌బస్ అందించింది.

# ఫిన్ అలెన్ ఊచకోత..

ఢిల్లీ క్యాపిటల్స్‌పై కేకేఆర్ అలవోక విజయం

ఢిల్లీ క్యాపిటల్స్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ ఘన విజయం

మెరుపు సెంచరీతో చెలరేగిన ఓపెనర్ ఫిన్ అలెన్

కేవలం 47 బంతుల్లోనే 100 పరుగులు చేసిన అలెన్

వరుసగా నాలుగో విజయంతో కేకేఆర్ జైత్రయాత్ర

అలెన్‌కు అండగా నిలిచిన కామెరాన్ గ్రీన్




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జైత్రయాత్ర కొనసాగుతోంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో, ఓపెనర్ ఫిన్ అలెన్ (100 నాటౌట్) అజేయ సెంచరీ సాధించడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌ను 8 వికెట్ల తేడాతో కేకేఆర్ చిత్తు చేసింది. ఈ సీజన్‌లో కోల్‌కతాకు ఇది వరుసగా నాలుగో గెలుపు కావడం విశేషం.

143 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్.. అలెన్ విధ్వంసంతో మరో 34 బంతులు మిగిలి ఉండగానే, కేవలం 14.2 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. కేవలం 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన అలెన్ తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 10 భారీ సిక్సర్లు బాదాడు. అతనికి కామెరాన్ గ్రీన్ (33 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

ఛేదన ఆరంభంలో కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే, అంగ్‌క్రిష్ రఘువంశీ వికెట్లను త్వరగానే కోల్పోయింది. అయితే, క్రీజులోకి వచ్చిన గ్రీన్‌తో కలిసి అలెన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఢిల్లీ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ, ముఖ్యంగా స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. విప్రాజ్ నిగమ్ వేసిన ఒకే ఓవర్‌లో మూడు సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. చివరగా, ముఖేష్ కుమార్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాది తన సెంచరీని, జట్టు విజయాన్ని ఘనంగా పూర్తి చేశాడు.

అంతకుముందు, కేకేఆర్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 142 పరుగులు మాత్రమే చేయగలిగింది.

**సంక్షిప్త స్కోర్లు:**

**ఢిల్లీ క్యాపిటల్స్:** 142/8 (20 ఓవర్లు) (పాతుమ్ నిస్సంక 50, అశుతోష్ శర్మ 39; కార్తీక్ త్యాగి 2-25, అనుకుల్ రాయ్ 2-31). **కోల్‌కతా నైట్ రైడర్స్:** 147/2 (14.2 ఓవర్లు) (ఫిన్ అలెన్ 100 నాటౌట్, కామెరాన్ గ్రీన్ 33 నాటౌట్; అక్షర్ పటేల్ 1-27).

## టీ20 జట్టులో భారీ మార్పులు..

సూర్య స్థానంలో శ్రేయాస్‌కు పగ్గాలు !




**ముంబై:** టీమిండియా టీ20 జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండియాకు 2026 టీ20 వరల్డ్‌కప్‌ను సూర్యకుమార్ అందించిన విషయం తెలిసిందే. అయితే అతన్ని సారథ్యం నుంచి తప్పించాలని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ .. కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌కు ఛాన్స్ ఇవ్వాలని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ యేటి ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ ఇరగదీస్తున్నాడు. రాబోయే సిరీస్‌ల్లో కెప్టెన్సీతో పాటు యువ ఆటగాళ్లకు కూడా అవకాశం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నది.

ఐర్లాండ్, ఇంగ్లండ్ టూర్లకు వెళ్లే జట్టుల్లో యువతకు చోటు దక్కే ఛాన్సు ఉన్నది. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ తన బ్యాట్‌కు పెద్దగా పనిచెప్పడం లేదు. సూర్య రాణించలేకపోతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ కూడా సూర్య విషయంలో సహనాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. ఫామ్‌లో లేని సూర్య స్థానంలో శ్రేయాస్‌ను కెప్టెన్‌గా దించాలని భావిస్తున్నారు. మరీ పేలవంగా ఆడుతున్న సూర్య టీమిండియా బృందంలో చోటు దక్కించుకుంటాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

నిజానికి టీ20ల్లో సూర్యకు మంచి రికార్డు ఉన్నది. కానీ ఇటీవల అతని ఫామ్ సరిగాలేదు. ఐపీఎల్ లో ఈసారి అతను ముంబై ఇండియన్స్ తరపున 10 మ్యాచుల్లో కేవలం 195 రన్స్ మాత్రమే చేశాడు. అయితే చేతిమడిమ సమస్యతో సూర్య బాధపడుతున్నాడని, అయినా నొప్పితోనే ఆడుతున్నాడని ఓ నివేదిక ద్వారా తెలిసింది. ఇక శ్రేయాస్ అయ్యర్ ఈ ఐపీఎల్ సీజన్‌లో 9 మ్యాచుల్లో 333 రన్స్ చేశాడు. అయితే రోహిత్ శర్మ కెప్టెన్‌గా రిటైర్మెంట్ అయిన తర్వాత సూర్యకుమార్ ఇప్పటి వరకు ఒక్క టీ20 సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఇక అయ్యర్ గత రెండేళ్ల నుంచి ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడలేదు. 2023 డిసెంబర్‌లో చివరిసారి అతను ఇండియా తరపున ఆడాడు.

క్రికెట్‌లో బ్యాటర్ల ఆధిపత్యంపై

## గవాస్కర్ ఆందోళన

బౌలర్లకు అన్యాయం జరుగుతోంది..

ఆ నిబంధన మార్చండి: గంగూలీకి గవాస్కర్ కీలక సూచన

బౌన్సర్లకు సంబంధించిన వైడ్ నిబంధన మార్చాలని సూచన

గతంలో బౌన్సర్లను తిరిగి ప్రవేశపెట్టడం వల్లే పించ్ హిట్టర్లు కనుమరుగయ్యారని వెల్లడి

బౌలర్లకు న్యాయం చేయాలంటూ ఐసీసీ కమిటీ చైర్మన్ గంగూలీకి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ వచ్చిన తర్వాత ఈ ఆట పూర్తిగా బ్యాటర్లకు అనుకూలంగా మారిపోయిందని, బౌలర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆందోళన వ్యక్తం చేశాడు. బౌండరీల కుదింపు, కఠినమైన ఫీల్డింగ్ ఆంక్షలు, శక్తిమంతమైన బ్యాట్‌లతో బ్యాటర్లు రాజ్యమేలుతున్నారని, ఆటలో సమతుల్యత తీసుకురావడానికి ఐసీసీ వెంటనే నిబంధనలు మార్చాలని సన్నీ సూచించాడు. ముఖ్యంగా బౌన్సర్లకు సంబంధించిన "వైడ్ బాల్" నిబంధనను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశాడు.

ప్రస్తుతం బ్యాటర్ తల మీదుగా బంతి వెళ్తే, దానిని వెంటనే వైడ్ ఇస్తున్నారని, ఇది ఫాస్ట్ బౌలర్ చేతులు కట్టేసి బౌలింగ్ చేయమని చెప్పినట్లుగా ఉందని గవాస్కర్ పేర్కొన్నాడు. "ఒక ఫాస్ట్ బౌలర్‌కు కొంత వెసులుబాటు ఇవ్వాలి కదా? ఇప్పటికే బౌండరీలు చిన్నవి చేసి బౌలర్లను నష్టపరుస్తున్నారు. ఇప్పుడు తల మీదుగా వెళ్లే బంతిని వైడ్ అనడం వారిని మరింత బలహీనపరచడమే. బ్యాటర్ సాధారణంగా నిలబడినప్పుడు, అతని తల పైనుంచి దాదాపు ఒక అడుగు (బ్యాట్ హ్యాండిల్ పొడవు) ఎత్తు వరకు బౌన్సర్ వేసేందుకు అనుమతిస్తే, ఫాస్ట్ బౌలర్లకు కొంత ఉపశమనం లభిస్తుంది" అని గవాస్కర్ వివరించాడు.

# హనీ ట్రాప్ జరగొచ్చు..

ఐపీఎల్ ప్లేయర్లకు బీసీసీఐ హెచ్చరిక




**ముంబై:** ఐపీఎల్ క్రికెటర్లకు బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. 10 ఫ్రాంచైజీలకు అధికారిక సమాచారాన్ని చేరవేసింది. 2026 సీజన్‌లో హనీట్రాప్ జరిగే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఓ లేఖలో అనుమానాలు వ్యక్తం చేశారు. టీ20 లీగ్‌లో పాల్గొంటున్న ఆటగాళ్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన తన కమ్యూనికేషన్‌లో పేర్కొన్నారు. ప్లేయర్ల హోటల్ రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ తెలిపింది. ఆటగాళ్లు ఏదైనా ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. ఏడు పేజీలతో కూడిన మార్గదర్శకాల లేఖను అన్ని ఫ్రాంచైజీలకు సైకియా అందజేసినట్లు తెలుస్తోంది.

ఆటగాళ్లు, సిబ్బందిపై నిఘా పెట్టేందుకు ఓ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. బీసీసీఐ, ఐపీఎల్ ఆపరేషన్స్ టీమ్ సభ్యులు అందులో ఉంటారు. హోటల్ రూమ్స్‌లో ఈ బృందాలు చెకింగ్ చేస్తాయి. అనుమతి లేని వ్యక్తులు ఎవరు ఉన్నా.. సదురు ప్లేయర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఆటగాళ్లను సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. అతిథులు ఎవరు వస్తున్నారు, హోటళ్ల వద్ద ఎలాంటి పరిస్థితి ఉందన్న అంశంపై టీమ్ మేనేజర్లు రికార్డులు సమర్పించాల్సి ఉంటుంది. ఐపీఎల్ జట్టు సభ్యుల గదుల్లోకి ఇతరులను అనుమతించబోము అని సైకియా చాలా క్లియర్‌గా ఆ మార్గదర్శకాల్లో చెప్పారు. హోటల్ రూమ్ నుంచి వెళ్లాలనుకునే ఆటగాళ్లు సెక్యూర్టీ లైజియన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్‌కు ముందుగా చెప్పి వెళ్లాలన్న నిబంధన పెట్టారు. హోటల్ పరిసరాల్లో తిరగాలనుకున్నా.. టీమ్ మేనేజర్ అనుమతి అవసరమని మార్గదర్శకాల్లో వెల్లడించారు. ఐపీఎల్‌కు చెందిన అవినీతి నిరోధక, సెక్యూర్టీ యూనిట్.. ఆటగాళ్ల ప్రవర్తనపై ఆందోళన వ్యక్తం చేసింది. డగౌట్లు, బస్సులు, హోటళ్ల వద్ద ప్లేయర్లు కాకుండా ఆటతో సంబంధం లేని వ్యక్తులు సంచరిస్తున్నట్లు ఏసీఎస్‌యూ తన నివేదికలో పేర్కొన్నది. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ ఆటగాళ్లకు ఆదేశాలు జారీ చేసినట్లు అర్థమవుతోంది. ఏసీఎస్‌యూ దీనిపై నివేదికను బీసీసీఐకి అందజేసినట్లు ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ దుమాల్ కన్ఫర్మ్ చేశారు.

# హ్యాబిటాట్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైన తెలుగు చిత్రం '23'




**టాకీస్:** ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు రాజ్ రాచకొండ తెరకెక్కించిన సామాజిక చిత్రం 23 మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'హ్యాబిటాట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'కు ఈ చిత్రం అధికారికంగా ఎంపికైంది. గతంలో 'మల్లేశం', '8 ఏ.ఎం. మెట్రో' వంటి సామాజిక చిత్రాలను రూపొందించిన రాజ్ రాచకొండ, ఈసారి వాస్తవ సంఘటనల ఆధారంగా ఒక బలమైన కథతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ముఖ్యంగా 1991 చుండూరు ఊచకోత, 1993 చిలకలూరిపేట బస్సు దహనం మరియు 1997 జూబ్లీహిల్స్ బాంబు పేలుళ్లు వంటి యదార్థ సంఘటనల సమాహారంగా ఈ సినిమా రూపొందింది.

సామాజిక అశాంతి, కుల వివక్ష మరియు న్యాయ వ్యవస్థలోని లోపాలను చర్చిస్తూనే, ఒక సున్నితమైన ప్రేమకథను ఇందులో చూపించారు. ఇప్పటికే ఈ చిత్రం ప్రతిష్ఠాత్మక 'గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు'ను కైవసం చేసుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో తేజ, తన్మయి, పావాన్ రమేష్ మరియు ఝాన్సీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా స్క్రీనింగ్ మే 22, 2026న సాయంత్రం 4:00 గంటలకు న్యూఢిల్లీలోని స్టైయిన్ ఆడిటోరియంలో జరగనుంది. ఈ ప్రదర్శనకు ప్రవేశం ఉచితం అయినప్పటికీ, ఆసక్తి గల వారు ఇండియా హ్యాబిటాట్ సెంటర్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని చిత్రబృందం తెలిపింది.



MOVIE TIME

# తమన్ షేర్ చేసిన తారక్ లుక్ వైరల్..

## 'డ్రాగన్' కోసమేనా ఈ మాస్ అవతార్?

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానుల్లో ప్రస్తుతం ఒక ఫోటో భారీ చర్చకు దారితీసింది. ప్రముఖ సంగీత దర్శకుడు థమన్ తాజాగా తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న తారక్ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. బ్లాక్ అండ్ వైట్‌లో కనిపించిన ఈ స్టైలిష్ చిత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోలో తారక్ మరింత సన్నగా, స్టైలిష్‌గా కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. తడి జుట్టు , ప్రత్యేకమైన గడ్డం , నోట్లో టూత్‌పిక్‌తో కనిపించిన తారక్ అవతార్ అభిమానుల్లో భారీ క్రేజ్ తీసుకొచ్చింది. ఇది మాస్ లుక్‌కు కొత్త నిర్వచనం, తారక్ స్టైల్ మరో స్థాయిలో ఉంది అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'డ్రాగన్'లోని లుక్ ఇదేనంటూ ఫ్యాన్స్ మధ్య చర్చ మొదలైంది. అయితే ఈ ఫోటో నిజంగా ఆ సినిమా లుక్‌కే సంబంధించినదా? లేదా అనేది ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. అయినప్పటికీ అభిమానులు మాత్రం ఇదే తారక్ కొత్త అవతార్ అంటూ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ఈ ఫోటోను పంచుకున్న తమన్‌కు అభిమానులు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నారు. దీంతో మరోసారి తారక్--తమన్ బాండింగ్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌కు ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో బాద్ షా, రామయ్య వస్తావయ్యా, రభస, టెంపర్, అరవింద సమేత వంటి చిత్రాలకు తమన్ సంగీతం అందించారు.

# సతీలీలావతితో ఏం చెప్పాలనుకున్నారో..?

## రొటీన్ కథతో బోరింగ్ సినిమా

టాకీస్: దాదాపు పదిహేనేళ్ళ క్రితం 'అందాల రాక్షసి' తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఉత్తరాఖండ్ బ్యూటీ లావణ్య త్రిపాఠి ఇవాళ తెలుగువారింటి కోడలు. కథానాయకుడు వరుణ్ తేజ్ తో ఆమె వివాహం 2023లో అయ్యింది. పెళ్ళికి ముందు లావణ్య త్రిపాఠి ఉమెన్ సెంట్రిక్ మూవీ 'హ్యాపీ బర్త్ డే' చేసింది. పెళ్ళి తర్వాత మరోసారి అదే తరహాలో 'సతీ లీలావతి' సినిమాలో టైటిల్ రోల్ ప్లే చేసింది. అప్పట్లో 'హ్యాపీ బర్త్ డే' ఆమెకు చేదు అనుభవాన్ని అందించింది. మరి ఇప్పుడు 'సతీ లీలావతి' ఎలాంటి అనుభవాన్ని అందించిందో చూద్దాం. చిన్నప్పటి నుండి తల్లిదండ్రులు (పవిత్ర లోకేష్, నరేశ్) చీటికీమాటికి



కీచులాడుకోవడంతో చిన్నారి లీల (లావణ్య త్రిపాఠి) మానసికంగా బాగా డిస్టబ్ అవుతుంది. పెరిగి పెద్దయ్యాక సైకియాట్రిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) ఆమెలో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుతాడు. సేతులోని గుడ్ క్వాలిటీస్ నచ్చి అతన్నే ఆమె పెళ్ళాడుతుంది. సేతు కారణంగా ఆమె మూడేళ్ళలో స్టార్ డైరెక్టర్ గా ఎదుగుతుంది. అక్కడ నుంచే ఆమె కష్టాలు మొదలవుతాయి. భార్య షూటింగ్స్ బిజీలో తనను పట్టించుకోక పోవడంతో సేతు డిప్రెషన్ కు లోనవుతాడు. ఆ సమయంలో నర్స్ నికోలా సెబాస్టియన్ (మడోన్నా సబాస్టియన్) కు దగ్గరవుతాడు. భార్యకు విడాకులిచ్చి... నికోలాను పెళ్ళి చేసుకోవాలని సేతు అనుకుంటాడు. ఆ విషయాన్ని లీలకు చెప్పినప్పుడు ఆమె ఎలా రియాక్ట్ అయ్యింది? ప్రేమించి మరి పెళ్ళి చేసుకున్న భర్త దూరం అవుతాడని తెలిసి ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఈ ప్రేమజంట విడిపోయిందా? తప్పులు దిద్దుకుని జీవితాన్ని కొనసాగించిందా? దానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ? అనేదే ఈ సినిమా కథ. చిన్న చిన్న కారణాల వల్ల భార్య భర్తలు విడిపోవడం చూస్తున్నాం. ఈ కథలోనూ అలాంటి సిల్లీ రీజనే దర్శకుడు తీసుకున్నాడు. భార్య దర్శకురాలని తెలిసి, ఆమె తనకు తగినంత సమయం ఇవ్వలేదని గుర్తించి, అదీ సైకాలజిస్ట్ అయిన ఓ వ్యక్తి అదే కారణంతో ఆమెకు విడాకులు ఇవ్వాలనుకోవడం సిల్లీగా అనిపిస్తుంది.




# 'ఇన్‌స్పెక్టర్ అవినాష్' సీజన్-2...

## డిఫరెంట్ క్యారెక్టర్లో ఊర్వశి రౌతేలా

టాకీస్: యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ఇన్‌స్పెక్టర్ అవినాష్' రెండో సీజన్‌లో నటిస్తున్న బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సిరీస్‌లో ఆమె నమ్మకమైన భార్య పూనమ్ మిశ్రా పాత్రను పోషిస్తున్న సంగతి తెలిసిందే. రెండో సీజన్‌లో తన పాత్రకు చోదకశక్తిగా నిలిచే భావోద్వేగం "మౌనంలో దాగి ఉన్న అస్తిత్వ పోరాటం" అని ఆమె తెలిపారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "ఈ సీజన్‌లో నా పాత్రను నడిపించే బలమైన భావోద్వేగం.. నిశ్శబ్దంలో దాగి ఉన్న మనుగడ. క్రైమ్ డ్రామాలలో చాలామంది హింస, అధికారం, యాక్షన్‌ను మాత్రమే చూస్తారు. కానీ, వాటి కింద భయం, భావోద్వేగ ఒంటరితనం దాగి ఉంటాయి. నా పాత్ర ఈ అంతర్గత సంఘర్షణను చాలా లోతుగా మోస్తుంది" అని వివరించారు. తన పాత్ర కేవలం భావోద్వేగాలతో కాకుండా, సంయమనంతో నడుస్తుందని ఊర్వశి పేర్కొన్నారు. "కొన్నిసార్లు బలం అంటే దూకుడుగా ఉండటం కాదు, నిశ్శబ్దంగా భరించడంలోనే అసలైన బలం ఉంటుంది. ఈ భావోద్వేగ సంక్లిష్టతే నన్ను ఈ పాత్రకు ఆకర్షించింది" అని ఆమె అన్నారు. యూపీకి చెందిన సూపర్ కాప్ అవినాష్ మిశ్రా నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కింది. ఇందులో బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా టైటిల్ రోల్‌లో నటించారు. మొదటి సీజన్ 2023లో విడుదలైంది. కాగా, బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన ఊర్వశి రౌతేలా, 2025లో నందమూరి బాలకృష్ణ సరసన 'డాకు మహారాజ్' చిత్రంతో టాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలోని 'దబిడి దిబిడి' పాట సోషల్ మీడియాలో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు.

# పెద్ది మూవీ అమెరికాలో రికార్డుల సృష్టి

## భారీగా అమ్ముడైన ప్రీ రిలీజ్ టిక్కెట్లు




టాకీస్: సాధారణంగా ఒక సినిమా బాక్సాఫీస్ సత్తా ఏంటో తెలియాలంటే థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాలి. ట్రైలర్ ఇచ్చే కిక్కును బట్టే ఆ సినిమా మార్కెట్ పొటన్షియాలిటీ ఆధారపడి ఉంటుంది. కానీ, కొన్ని సినిమాలు మాత్రం ఈ లెక్కలకు అతీతం. కేవలం క్రేజీ కాంబినేషన్ మీద ఉన్న నమ్మకం, హీరో ఇమేజ్ ఇచ్చే ధైర్యంతోనే అంచనాలు ఆకాశాన్ని తాకుతుంటాయి. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది సినిమా సరిగ్గా ఇదే మ్యాజిక్ చేస్తోంది.
పెద్ది సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి కూడా అంచనాలు ఆకాశాన్ని తాకుతూనే ఉన్నాయి. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ పెద్ది రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. ఇంకా ట్రైలర్ కూడా బయటకు రాకముందే నార్త్ అమెరికాలో రికార్డుల వేట మొదలైపోయింది. బుకింగ్స్ ప్రారంభించిన కేవలం నాలుగు గంటల్లోనే 100కె మార్కును దాటి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏ భారతీయ సినిమాకు సాధ్యం కాని రీతిలో, అతి తక్కువ సమయంలో ఈ మైలురాయిని చేరుకోవడం ఒక్క రామ్ చరణ్‌కే చెల్లింది. మెగా అభిమానులు కళ్ళలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న జూన్ 3వ తేదీ రానే వస్తోంది. ఆ రోజు ఓవర్సీస్‌లో భారీ ఎత్తున ప్రీమియర్లతో పెద్ది జాతర మొదలుకానుంది. ఇప్పటి వరకు విడుదలైన టీజర్స్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఆ రా అండ్ రస్టిక్ లుక్స్ సినిమాపై విపరీతమైన ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పటికే పెద్ది నుంచి రిలీజైన పాటలు, విజువల్స్ చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి.

# పల్లెటూరు ప్రేమకథ.. 'గోదారి గట్టుపైన'



**టాకీస్:** మేం ఫేమస్ చిత్రంతో యూత్ ఆడియెన్స్‌కు చేరువైన సుమంత్ ప్రభాస్, సుదీర్ఘ విరామం తర్వాత నటించిన తాజా చిత్రం 'గోదారి గట్టుపైన'. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే గోదావరి తీర ప్రాంత నేపథ్యంలో, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాల మధ్య దర్శకుడు సుభాష్ చంద్ర ఈ చిత్రంను తెరకెక్కించారు. కోనసీమలోని ఓ మారుమూల గ్రామంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే శ్యామ్ బాబు (జగపతిబాబు)కు తన కూతురు మాయ (నిధి ప్రదీప్) అంటే ప్రాణం. ఆమె సంతోషమే తన ప్రపంచంగా బ్రతుకుతుంటాడు. అయితే, మాయ జీవితంలోకి ఆటో డ్రైవర్ రాజు (సుమంత్ ప్రభాస్) ప్రవేశించడంతో కథ మలుపు తిరుగుతుంది. వీరిద్దరి మధ్య చిగురించిన ప్రేమ, భిన్నమైన సామాజిక నేపథ్యాల కారణంగా తండ్రీకూతుళ్ల మధ్య ఎలాంటి సంఘర్షణకు దారితీసింది? చివరకు ప్రేమ గెలిచిందా లేక తండ్రి బాధ్యత గెలిచిందా? అనేదే ఈ చిత్ర ప్రధానాంశం. తెలంగాణ యాసకు అలవాటు పడిన సుమంత్, ఈ సినిమాలో గోదావరి యాసను ఎంతో సహజంగా పలికించి ఆశ్చర్యపరిచారు. ఆటో డ్రైవర్ పాత్రలో ఆయన నటన పరిణతి చెందింది.

# ఓటీటీలోకి వచ్చేస్తోన్న ధురంధర్-2

టాకీస్: బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ 2 ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ సినిమా డిజిటల్ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, తాజాగా ఓటీటీ విడుదల తేదీపై స్పష్టత వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా అద్భుత వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడు మే 15 నుంచి ఈ సినిమా ఓటీటీలో ప్రసారం కానుందని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. 'ధురంధర్ 2' ఒకేసారి రెండు ప్రముఖ ఓటీటీ వేదికల్లో విడుదల కానుంది. భారతదేశంలో ఈ చిత్రం



జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుండగా, విదేశీ ప్రేక్షకుల కోసం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు.
అంతేకాకుండా ఈ సినిమాను కేవలం హిందీలోనే కాకుండా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు. దీంతో దక్షిణాది ప్రేక్షకులు కూడా తమ భాషలో ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు.

# త్రిష- విజయ్‌ల పెళ్లి అంటూ.. వార్తలు చక్కర్లు

**టాకీస్:** త్రిష కృష్ణన్. ప్రస్తుతం తమిళ్ ఇండస్ట్రీలోనే కాదు తెలుగు ఇండస్ట్రీలో కూడా ఈ పేరు మార్మోగిపోతోంది. ఒకప్పుడు సినిమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న త్రిష.. ఇప్పుడు దళపతి విజయ్ తో ప్రేమాయణం నడిపిస్తోంది అనే వార్తల వలన గుర్తింపు తెచ్చుకొంటోంది. విజయ్ ఎన్నికల్లో గెలవడానికి ప్రధాన కారణం త్రిష అనే చెప్పుకొస్తోన్నారు. త్రిష కోసం విజయ్.. తన భార్య సంగీతకు విడాకులు ఇవ్వనున్నాడు. ఈ విషయాన్ని సంగీతనే అధికారికంగా తెలిపింది. ఎలక్షన్స్ ముందు విజయ్ - త్రిష రిలేషన్ ని తప్పు అన్నవాళ్ళే గెలిచాకా ఈ జంట పెళ్ళి చేసుకోవాలని కోరుకోవడం గమనార్హం. రికార్డ్ విజయాన్ని అందుకున్న విజయ్.. త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నాడు. ఇక దాని తరువాత త్రిషను ఆయన రెండో పెళ్ళి చేసుకుంటున్నాడని కోలీవుడ్ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా సంగీతతో విడాకులు తీసుకున్నాకా.. విజయ్, త్రిష మెడలో తాళి కట్టనున్నాడట. 999 లో విజయ్, సంగీతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.



ఈ జంటకు ఇద్దరు పిల్లలు. ఇక త్రిష, విజయ్ జీవితంలోకి వచ్చాకా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చాలాకాలంగా సంగీత, విజయ్ కి దూరంగా పిల్లలతో కలిసి ఉంటుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.